నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-కొమురవెల్లి



నీట్ అవకతవకలపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విద్యార్థి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న నీట్ అవకతవకలపై సెట్టింగ్ జడ్జితో తో విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని లీకేజీకి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అత్తినిహారిక, వినోద్, బండి అరవింద్, సంజు శివ, సన్నీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నమస్తే తెలుగు దినపత్రిక

1

మెదక్

శుక్రవారం | 05 జులై 2024 | www.navatelangana.com

గ్రామ పంచాయితీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-వర్గల్



గత కొన్ని నెలలుగా జీపీ కార్మికులకు జీతాలు రాకపోవడంతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు జీపీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ కార్మిక సంఘం ద్వార ఎంపీడీఓ విజయ లక్ష్మికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తమకు జీతాలు రావడంలేదని, సకాలంలో జీతాలు రాకపోవడంతో కుటుంబ నిర్వహణ భారంగా మారుతుందన్నారు. తమకు సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మర్రికింది నాగరాజు, రమేష్, పలు గ్రామాల జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు





- రోగులకు ఏ సమస్య రావద్దు
- పర్యవేక్షణ లోపమే మందుల కొరత కాదు
- సదాశివపేటలో డయాలసిస్... తెల్లాపూర్‌లో కమ్యూనిటీ ఆసుపత్రి
- వనరులు పుష్కలం...అభివృద్ధికి పాటుపడదాం
- సర్కార్ దవాఖానాలో మందుల్లేవు: సంజీవరెడ్డి
- నర్సాపూర్‌లో రక్తనిధి పెట్టండి:సునీతారెడ్డి
- సిద్దిపేటంత సంగారెడ్డి అభివృద్ధి కాలే: ఎంపీ సురేష్ షేట్కర్
- గ్రామ పంచాయతీ వర్కర్లకు జీతాలివ్వాలని ఏకాభిప్రాయం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'వైద్య, ఆరోగ్య శాఖలో అధికారులు, వైద్యులు, సిబ్బందికి నిర్లక్ష్యం తగదు. ఆసుపత్రుల్లో రోగులకు ఏ సమస్య రానీవ్వొద్దు. పర్యవేక్షణ లోపం తప్ప మందుల కొరత ఉండదు. ప్రజలకు స్థానికంగా వైద్యం అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని పటిష్టం చేయాలి. సంగారెడ్డి జిల్లాలో అనేక వనరులున్నాయి. మరింత అభివృద్ధిని సాధించేందుకు ముందుకు పోదాం' అంటూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ పిలుపు సుతిమెత్తగా హెచ్చరించారు. జెడ్పీ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దామోదర రాజనర్సింహ హాజరై మాట్లాడారు. తొలుత వ్యవసాయ శాఖపై చర్చించారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత ఏర్పడకుండా చూడాలని సభ్యులు సూచించారు. హత్నూర మండలంలో ఏఈఓలను నియమించాలని జెడ్పీటీసీ కోరారు. జిల్లాకు అదనంగా 9 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి అవసరముందని జెడీఏ అంబికాసోనీ మంత్రి దృష్టికి తెచ్చారు. వర్షాలేక పత్తి పంట నష్టమేర్పడినందున పంటనష్టపరిహారం ఇప్పించాలని కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి మంత్రిని కోరారు. జిన్నారం మండలంలో ల్యాండ్ పూలింగ్ కింద రైతుల నుంచి భూమి తీసుకున్నారు తప్ప వారికి ఇవ్వాల్సిన 600 గజాల భూమి ఇవ్వలేదని జెడ్పీటీసీ ప్రభాకర్ సమావేశం దృష్టికి తెచ్చారు. వైద్య రోగ్య శాఖపై వాడివేడి చర్చ సాగింది. న్యాల్‌కల్ జెడ్పీటీసీ మాట్లాడుతూ జహీరాబాద్ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు లేకపోవడం వల్ల అనేక మంది రోగులు చనిపోతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. వంద పడకల ఆసుపత్రి కట్టుకుని వైద్యుల్ని నియమించకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక, కమ్యూనిటీ, ఏరియా ఆసుపత్రుల్లో కనీస మందుల్లేవన్నారు. ఇండెంట్‌లో 20 శాతం డ్రగ్స్‌కూడా అందుబాటులో లేవని మంత్రి దృష్టికి తెచ్చారు. డీసీహెచ్ఓ వివరణ ఇస్తూ డ్రగ్స్ పైనుంచే రావడంలేదని చెబుతుండగా మంత్రి జోక్యం చేసుకున్నారు. జిల్లాకు రెగ్యులర్, ఎసెన్సియల్ మందులు నెలకు ఎన్ని కావాలి..? ఎంత ఖర్చు అవుతుంది..? అనేది ప్లానింగ్, పర్యవేక్షణ లేకపోవడం తప్ప మందుల కొరత ఉండదన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి నిరంతర పర్యవేక్షణ చేయాలని మందలించారు. ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవల్ని నిరంతరం పరిశీలించాలని, ఏ సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా వైద్య అధికారులపై ఉందని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం చేపట్టిన చర్యల్ని చెప్పాలని డీఎంహెచ్ఓను మంత్రి ప్రశ్నించారు. దీంతో గాయత్రీదేవి చేసిన కార్యక్రమాల్ని వివరించారు. వైద్య సేవల్ని విస్తరించేందుకు తెల్లాపూర్‌లో కమ్యూనిటీ ఆసుపత్రి, సదాశివపేటలో డయాలసిస్ సెంటర్, కంగ్టిలో కమ్యూనిటీ ఆసుపత్రుల ఏర్పాటు చేయబోతున్నామన్నారు. నాగిల్‌గిద్ద ప్రభుత్వ ఆసుపత్రి పక్కనే ప్రయివేట్ ఆసుపత్రిని పెట్టినా చర్యలు తీసుకోవట్లేదని జెడ్పీటీసీ రాజు రాథోడ్ సభ దృష్టికి తెచ్చారు. డాక్టర్లు, సిబ్బంది కొరతపై ఇతర సభ్యులు ప్రస్తావించారు. ఎంపీ సురేష్ షేట్కర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా మాదిరి సంగారెడ్డి అభివృద్ధి కాలేదన్నారు. ఐదేళ్ల కాలంలో జిల్లా, మండల పరిషత్‌లకు నిధుల్లేకుండా బీజేపీ ప్రభుత్వం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నిధులివ్వాలన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖలో అర్బన్‌లో పనిచేస్తున్న వైద్యులను గ్రామీణ ప్రాంతాలకు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వాళ్లను అర్బన్‌కు బదిలీ చేయాలన్నారు. జాతీయ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వాళ్లకు జీతాలివ్వా లన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్‌లో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణం కోసం మంజూరైన రూ.40 కోట్లను నిలిపి వేశారని వాటిని మంజూరు చేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ ఐదేళ్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. జెడ్పీ సమావేశానికి ముందు సాయుధ తెలంగాణ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. సమావేశం ముగిశాక జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే మాణిక్యరావు, కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్ మండల ప్రత్యేక అధికారిగా ఏడీ బిక్షపతి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ మండల ప్రజా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో జహీరాబాద్ మండల ప్రత్యేక అధికారిగా వ్యవసాయ శాఖ ఏడి బిక్షపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందించారు. ఎంపీఓ మహేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులందరూ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తమ తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసి సమిష్టిగా పని చేసి మండల అభివృద్ధికి పాటుపడాలని సిబ్బందిని కోరారు. గ్రామాల్లో పారిశు కార్యక్రమాలను చేపట్టడంతో పాటు.. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ అధికారిని ప్రవీణ, ప్రమోద్ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య



నవతెలంగాణ-న్యాల్‌కల్

కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రేజింతల్ గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. హద్నూర్ ఎస్సై రామునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. రేజింతల్ గ్రామానికి చెందిన బేగరి నరసింహులు(55) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కడుపు నొప్పి భరించలేక గురువారం రోజున ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు.

బాసర త్రిబుల్ ఐటీకి జోగిపేట విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సింధూజ మంచి మార్కులు సాధించి బాసర త్రిబుల్ ఐటీ సీటు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నాగేశ్వర్, ప్రిన్సిపాల్ డెలిఫిన్ లెవర్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌లు చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

ఏపీజీవీబీ నూతన ఫీల్డ్ ఆఫీసర్‌గా నరేష్

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంమైన వట్‌పల్లి ఏపీజీవీబీ నూతన ఫీల్డ్ ఆఫీసర్‌గా నరేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మెదక్ జిల్లా దుబ్బాక ఏపీజీవీబీ బ్యాంకులో ఇప్పటివరకు విధులు నిర్వహించి బదిలీపై వట్‌పల్లికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్ బదిలీపై సిద్దిపేటకు వెళ్లారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

మాజీ ఎంపీటీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తాజా మాజీ జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, తాజా. మాజీ ఎంపీపీ పాండు గౌడ్‌లు అన్నారు మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన దండు బాలమల్లు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతనికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున పార్టీ ప్రమాద బీమాను మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మండల నాయకులతో కలిసి గురువారం మృతుడి భార్య దండు నరసమ్మ కు రెండు లక్షల బీమా చెక్కును అందజేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బల్ రెడ్డి,ముదిరాజ్ నాయకులు మ్యాకల కనకయ్య, మాజీ మండల యూత్ అధ్యక్షుడు కర్ణాకర్, నాయకులు సుధాకర్ మధుసూదన్ రెడ్డి, కిష్టా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పోచ గౌడ్, శ్రీనివాస్, చంద్రం, మురళి తదితరులున్నారు.

ఎంపీటీసీకి ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని బేగంపేట గ్రామ ఎంపీటీసీ పోతిరెడ్డి స్రవంతికి మండల కాంగ్రెస్ శ్రేణులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం బేగంపేట గ్రామంలో ఎంపీటీసీ స్రవంతి దంపతులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండలాధికార ప్రతినిధి జనాగం శంకర్, నాయకులు చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, బండిపెల్లి రాజు, బైరి సంతోష్ శాలువ కప్పి జ్ఞాపిక అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు.గ్రామ కాంగ్రెస్ నాయకులు జయరాం, శీలం నర్సయ్య, బెజ్జంకి నరేశ్, రాజేందర్, బుర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.రెడ్డి జేఏసీ నాయకుల ఆత్మీయ సన్మానం.ఎంపీటీసీ పోతిరెడ్డి స్రవంతి దంపతులను మండల రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు శాలువ కప్పి ఆత్మీయ వీడ్కోలు పలికారు.మండలాధ్యక్షుడు ముక్కీస తిరుపతి రెడ్డి, హన్మండ్ల లక్ష్మారెడ్డి, నారెడ్డి సుదర్శన్ రెడ్డి, చెలుకల కొండాల్ రెడ్డి ఐలేని శ్రీనివాస్ రెడ్డి, సుదీర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

మండల ప్రత్యేకాధికారిగా మల్లేశం

నవతెలంగాణ-బెజ్జంకి : ఎంపీటీసీ పదవి కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం అయా మండలాలకు ప్రత్యేకాధికారులతో పాలన కొనసాగించడానికి నిర్ణయించింది. మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం గురువారం నియమాకమయ్యారు.

వడ్డీ లేకుండా ఆటోలకు రుణాలు

నవ తెలంగాణ - సిద్దిపేట : ఎలాంటి వడ్డీ రేట్ లేకుండానే పేదవారికి ఆటో నడుపుకోవాడానికి రుణాలు అందిస్తున్నామని ఖిద్మత్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఈ పథకాన్ని గురువారం ప్రారంభించి, లబ్ధిదారుడికి వడ్డ లేని ఋణం పథకం ద్వారా ఆటోను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2016 లో ప్రారంభమైన ఖిద్మత్ సొసైటీ అంచలంచలుగా అభివృద్ధి సాధించిందన్నారు. కుల, మతాలకు అతీతంగా 4 వేల మందికి పైగా అకౌంట్‌లు తెరిచారని తెలిపారు. ఇలాంటి పథకం వల్ల ఆటో నడుపుకొని జీవితం గడిపే వారు ప్రశాంతంగా జీవించవచ్చని తెలిపారు. అద్భుతమైన పథకాన్ని ఖాతా దారులు సద్వినియోగం చేసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జుబేర్, ఖుద్దుస్, అంజద్, సిద్దిపేట తాంజీమ్ ఉపాధ్యక్షులు ఉబెద్, ప్రముఖ న్యాయవాది రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివి

నవతెలంగాణ- రాయపోల్



ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివని రాబోయే రోజుల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కరించడంలో తమ వంతు బాధ్యత వహించాలని దౌల్తాబాద్ ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రం ఏఆర్ ఫంక్షన్ హాల్ లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా వీడ్కోలు వారికి సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను, కో ఆప్షన్ సభ్యులును శాలువాతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహీముద్దీన్, దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, తహసీల్దార్ సుజాత, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, ఎంపీఓ సయ్యద్ గఫూర్ ఖాద్రి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బండారు దేవేందర్, కోఆప్షన్ సభ్యులు అహ్మద్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పొన్నం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



పొతారం ఎస్ గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను గురువారం రాత్రి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ఒక్కొక్కరితో ఆత్మీయంగా పలకరిస్తూ మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజూ అన్నం, కూరలు ఎలా ఉన్నాయని, ఉదయం ఏ రోజు ఎలాంటి టిఫిన్ పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మంత్రి కుటుంబ సభ్యులకు మొబైల్ వీడియో కాల్‌లో పరిచయం చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్కూల్‌కి గ్రౌండ్ చిన్నగా ఉన్న అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్కూల్ గ్రౌండ్ కోసం స్థల పరిశీలన చేసి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపక బృందం విద్యార్థులకు ప్రేమపూర్వకంగా, స్నేహ పూర్వకంగా మెలగాలని ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేలా వారిలో ఉత్సాహాన్ని నింపాలని సూచించారు..

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శ

నవతెలంగాణ-పుల్కల్



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గురువారం పరామర్శించారు. అందోల్ మండలం నేరేడిగుంట సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్కల్ మండలం పెద్దరెడ్డిపేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్.. బుధవారం రోజున అందోల్ మండలం ఎర్రారం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ కుటుంబాన్ని మంత్రి గురువారం పరామర్శించారు. తక్షణ సాయం కింద ఐదు లక్షల రూపాయలను బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే సంబంధిత శాఖ తరపున రూ. 15 లక్షలు చెల్లించేందుకు ఒప్పుకున్నదన్నారు. అంతేకాకుండా బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇకముందు విద్యుత్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకొని మరమ్మత్తులు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా మరమ్మత్తులు చేస్తే తమ విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఉంటారన్నారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, అంజయ్య, కుమ్మరి లింగం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు హర్షద్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలి

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి. మంగ

నవతెలంగాణ-సంగారెడ్డి



జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అంగన్వాడీ టీచర్‌కు రెండు లక్షలు, హెల్పర్‌కు ఒక లక్ష, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ జిల్లా కమిటీ సమావేశాన్ని కేకే భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 20023 సెప్టెంబర్‌లో 24 రోజులపాటు సమ్మె జరిగితే.. అప్పుడున్న ప్రభుత్వం యూనియన్‌తో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేసిందన్నారు. ఆ సందర్భంలో టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు లక్ష, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలు అమలు చేయకుండా కొత్త ప్రభుత్వం జీవో 10 ప్రకారం 60 ఏండ్లు నిండిన వారికి రిటైర్మెంట్ చేస్తూ టీచర్ రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50,000 చెల్లిస్తామని జీవో విడుదల చేసిందని.. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 65 ఏండ్లు ఉన్న వారిని డ్యూటీలోకి రావొద్దని చెబుతున్నారని ఇది సరికాదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి ఇతర సౌకర్యాల గురించి మాట్లాడటం లేదన్నారు. వెంటనే జీవో 10ని రద్దుచేసి గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. లేని యెడల ఆందోళన తప్పదని హెచ్చ రించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు, యూనియన్ అధ్యక్షులు శశికళ, నాయకులు ఇందిరా, సంగీత, బాలమణి, భూమవ్వ, లక్ష్మి, వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలి

మున్సిపల్ కార్యాలయం ముందు ఆదిత్య నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి



వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను, పిల్లలను కాపాడాలని కోరుతూ ఆదిత్యనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు జి.సాయిలు మాట్లాడుతూ.. కాలనీలో వీధి కుక్కల వల్ల ప్రజలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజుల క్రితమే ఎనిమిదేండ్ల పిల్లాడిపై, మహిళలపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. ఆ గాయాలతో హాస్పిటల్ వెళ్తే.. వేల రూపాయలు ఖర్చవుతున్నాయన్నారు. కుక్కల ధాటికి పిల్లలు స్కూల్‌కి వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. స్కూల్‌కు వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి..కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వేణుగోపాల్, రాజేంద్రప్రసాద్, లక్ష్మణ్, గోపాల్ గౌడ్, హేమంత్‌కుమార్, సంతోష్, రవి, కిరణ్, ఆలీ పాల్గొన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రజలను చైతన్య చేసి పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆరెపల్లి , అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అమరుడు వీరుడు దొడ్డి కొమురయ్య బడుగు బలహీన వర్గాలకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. పోరాటం ద్వారా చరిత్రలో నిలిచిపోతామని పోరాటం చేయకుండా చరిత్రతో కలిసి నడిస్తే మిగిలేది ఏమి ఉండదన్నారు. అనంతరం హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి 18వ వార్షికోత్సవానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, మండల అధ్యక్షుడు బంక చందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేస్తాం

నవతెలంగాణ-ఝరాసంగం



జిల్లా పరిషత్‌లకు అధిక నిధుల మంజూరు కోసం కేంద్రంలో కొలువుదిరిన కొత్త ప్రభుత్వంపై పార్లమెంట్లో ఒత్తిడి తీసుకొస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల వీడుకోలు సమావేశాన్ని ఎంపీడీవో సుధాకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం శివకుమార్ లు హాజర య్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ హయాంలో 73, 74 రాజ్యాంగ సవరణలు తీసుకువచ్చి జిల్లా పరిషత్ మండల పరిషత్ గ్రామ పంచాయతీలకు నిధులను అత్యధికంగా కేటా యించిందని, ప్రస్తుతం వ్యవస్థతో జిల్లా పరిషత్లకు నిధుల కేటాయింపు కుదించాలన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతం నుండి కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం కొరకు నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గంలో నిమ్జ్ ప్రాజెక్టు తేవడం జరిగిందని ఈ మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే ఇక్కడి యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అంతకు ముందు మాజీ సి డి సి చైర్మన్ ఉమాకాంపాటిల్ ఎంపీటీసీకు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వినీల నరేష్, ఎంపీపీ దేవదాస్, ఎంపీటీసీ సభ్యులు శంకర్ పాటిల్, విజేందర్ రెడ్డి,రాజు, రజిని ప్రియ సంతోష పాటిల్, సంగీత గుండప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంత రావు పాటిల్, తహసిల్దార్ సంజీవరావు, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్ హఫీజ్, అజీజ్,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ ప్రాజెక్టుకు సాగు భూములు ఇవ్వలేము



నవతెలంగాణ-ఝరాసంగం

నిమ్జ్ ప్రాజెక్టు అధికారులు రెండో విడత భూ సేకరణ కార్యక్రమం నిర్వహించే ఆలోచనను మానుకోవాలని మండల పరిధిలోని బర్దీపూర్, ఎల్గోయి గ్రామాల రైతులు స్థానిక తహసీల్దార్ సంజీవరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి విడత కింద నిమ్జ్ ప్రాజెక్టుకు తమ గ్రామాల నుంచి సుమారు 3200 ఎకరాల భూమిని సేకరించారన్నారు. మళ్లీ రెండో విడత కింద 472 ఎకరాల భూమి తీసుకుంటారని ప్రచారం జరుగుతుందని.. ఆ నిర్ణయం మానుకోవాలన్నారు. గతంలోని నిమ్జ్ ప్రాజెక్టుకు భూమి తీసుకోవడంతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఉన్న కొంత సాగు భూమి కూడా తీసుకుంటే గ్రామాన్ని వదలి వెళ్లే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, రైతులు గుండప్ప, వేణు, అష్మద్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానించిన ఉద్యోగులు

నవ తెలంగాణ - సిద్దిపేట



జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ పదవి విరమణ చేసిన సందర్భంగా టీఎన్జీవోస్ పంచాయతీరాజ్ మినిస్టర్ ఫోరం సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడాల రామ్మోహన్, కార్యదర్శి విజయభాస్కర్, టీఎన్జీవోస్ సహ అధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు వినయ సుకుమారి, జేబీనా సుల్తానా, జమున రాణి ,సిద్దిపేట యూనిట్ అధ్యక్షులు శశిధర్ ,శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ పనులను పరిశీలించిన ఆర్డీవో

నవతెలంగాణ - హవేలి ఘనాపూర్



ధరణి లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరత గతిన పూర్తయ్య విధంగా చర్యలు తీసుకోవాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి తహశీల్దార్ నారాయణను ఆదేశించారు గురువారం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ మండలంలోని ధరణి లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని తాసిల్దార్ కు సూచించారు. రెవెన్యూకి సంబంధించిన ఇలాంటి పనులు పెండింగ్లో ఉండరాదని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉంచరాదని అన్నారు.మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గకుండా విద్యార్థులకు మంచి భోజనం, విద్యార్థులతో కలిసి తరగతి గదులు పాఠశాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో నయా తహశీల్దార్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డికి సత్కారం

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, జిల్లా వైస్ చైర్మెన్ ప్రభాకర్‌కు ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంలో గురువారం తెలంగాణ పంచాయతీరాజ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నర్సింలు, ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ.. జిల్లాను గత 5 ఏండ్లుగా అన్నీ రకాల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజా పరిషత్‌కు ఉద్యోగుల సహకారంతో దీన్‌దయల్ ఉత్తమ అవార్డు రావడం గర్వకారనమన్నారు. వారు మున్ముందు ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింలు, జలాల్, కపిల్, రాజేష్, సంఘమేశ్వర్, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ను ఆవిష్కరించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-జహీరాబాద్



న్యాల్‌కల్ మండలంలోని గాంగ్వర్ చౌరస్తాలో గల ఖదీర్ హుస్సేన్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దర్గా నిర్వాహకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్‌ను మాజీమంత్రి చంద్రశేఖర్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో అన్ని మతాలవారు కలసి మెలసి ఉండడంతో పాటు పండుగలను ఐక్యంగా జరపడం ఆనందకరమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కాజామియా, మహమ్మద్ హర్షద్, మహమ్మద్ మక్షుద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-సంగారెడ్డి



ఈనెల 13,14 తేదీల్లో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలో జరిగే 9వ రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ ఈతల పోటీల కోసం సంగారెడ్డి పట్టణంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో బాలబాలికలకు గురువారం ఈతల పోటీలు నిర్వహించారు. స్విమ్మింగ్ కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీహెచ్ఈ ఎల్ పీఈటీ శశికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఈతల పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి జావిద్ అలీ ప్రారంభించారు. అండర్ -14 ఫ్రీ స్టైల్‌లో మొదటి స్థానంలో నిలిచిన మహమ్మద్ అబ్దుర్ రెహమాన్, రెండో స్థానంలో నిలిచిన మోక్షిత్, అండర్-11 మొదటి స్థానంలో నిలిచిన మహమ్మద్ ఉజేర్, రెండు స్థానంలో విన్సెంట్, గర్ల్స్ ఫ్రీ స్టైల్ లో అలియా ఫాతిమా తోపాటు జిల్లా స్థాయిలో వివిధ విభాగాలలో విజేతగా నిలిచిన క్రీడాకారులందరికీ అభినం దనలు జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ కోశాధికారి జావిద్ అలీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్, స్విమ్మింగ్‌పుల్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



ప్రజా సేవ చేయడానికి జెడ్పీటీసీగా గెలిపించిన మండల ప్రజలకు జెడ్పీటీసీ స్వప్న భాస్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ గుర్తింపుతో, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో జెడ్పీటీసీగా అవకాశం వచ్చిందన్నారు. మండల అభివృద్ధిలో ఇన్ని రోజులు భాగస్వామ్యం అయినందుకు గర్వంగా ఉన్నదన్నారు. ఇన్ని రోజులు తనకు అండగా, తోడుగా నిలిచిన న్యాల్కల్ మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మీడియా మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో దాదాపుగా 80 మందికి పైగా విద్యార్థులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్ గురువరం నోట్‌బుక్‌లు, స్లేట్లు, పెన్నులు, పెన్సిళ్ళు మరియు ఇతర స్టేషనరీ సామగ్రిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జె. రాణి స్కూల్ హెడ్ మిస్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహ్మద్ అలీమ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బాసర త్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మెటల్‌కుంట, న్యాల్‌కల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలకు సద్దాం, సుస్మిత అనే విద్యార్థులు బాసర త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్టు మండల ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 9.8 జీపీఏ ఉత్తీర్ణత సాధించిన వారికి సీటు దక్కినట్టు చెప్పారు. ఆ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి మిత్రులు, తల్లిదండ్రులు అభినందించారు.

అందోల్ మండల ప్రత్యేకాధికారిగా గీత

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ మండల ప్రత్యేకాధికారిగా సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ ఆర్.గీత పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందోల్ మండలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామాలభివృద్ధికి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఎంపీడీవో రాజేష్ కుమార్, సూపరింటెంట్ అశోక్, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా గాయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ఉండాలని హద్నూర్ ఎస్ఐ రామునాయుడు విద్యార్థులకు అవగాహన చేశారు. హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ.. ఆన్లైన్ మోసాల పట్ల తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీ ఫోన్ లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ , లెక్చరర్లు జగదీశ్వర్, విద్యార్థులు ఉన్నారు.

కంగ్టి మండల ప్రత్యేకాధిరిగా నూతన్‌కుమార్

నవతెలంగాణ-కంగ్టి



కంగ్టి మండలప్రత్యేకధికారీగా వ్యవసాయశాక అధికారి ఏడిఏ నూతన్ కుమార్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు గురువారం రోజున బాధ్యతలు చేపట్టినట్టు చెప్పారు. మండల ప్రజలు గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సత్యయ్య ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధు, ఏపిఓ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను వెంటనేభర్తీ చేయాలి



నవతెలంగాణ-పుల్కల్

రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ బీజేవైఎం నాయకులు తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షులు కుమ్మరి పాండరి మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాల్లేక ఎంతోమంది నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఆందోల్ నియోజకవర్గ కన్వీనర్ గౌండ్ల కార్తీక్‌గౌడ్, పుల్కల్ మండల బీజేవైఎం అధ్యక్షులుమహేందర్, నవీన్, శ్రీకాంత్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

జోగిపేటలో పచ్చదనం పరిశుభ్రత

నవతెలంగాణ-జోగిపేట



డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జన్మదిన వారోత్సవాలలో భాగంగా గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో అందోల్ పెద్దచెరువులోని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. చెరువు చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాత్, మానయ్య, సతీష్ కుమార్, మహేందర్, సుమన్, జగన్నాథం, ఆంజనేయులు, హరీష్, పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- రీ ఎగ్జామ్ నిర్వహించాలి
- పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్
- బంద్ విజయవంతం















నవతెలంగాణ-జోగిపేట

నీట్ పరీక్షను రద్దు చేసి.. రీ ఎగ్జామ్ నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు గురువారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతం అయినట్టు నాయకులు తెలిపారు.

జోగిపేటలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బంద్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్‌రెడ్డిలు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో పేపర్ లీక్, అవకతవకలు మరువకముందే.. యూజీసీ-నెట్ ఎగ్జామ్‌ను రద్దు చేయడంతో యువత ఆందోళనకు గురవుతున్నదన్నారు. 23 లక్షల 33 వేల 297 మంది నీట్ పరీక్ష, 11 లక్షల మంది యుజీసి-ఎన్ఎటి పరీక్ష రాశార న్నారు. అలాంటి పరీక్షల్లో అవకతవకలు జరగడం దారుణ మనాన్నరు. యుజీసి-ఎన్ఎటి రద్దు చేయడం.. నీట్ అవకత వకలను మరిపించడం కోసమేననే అనుమానాలు కలుగుతు న్నాయని ఆరోపించారు. నీట్, యుజీసి-ఎన్ఎటి పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్రాలకే అప్పజెప్పాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులు లేరని.. పాఠశాలలు మూసివేయా లనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి వాణి, నాయకులు శ్రీను, కార్తీక్, హరీష్, రాము,తదితలు పాల్గొన్నారు.

జహీరాబాద్ : జహీరాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీ.రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షల నిర్వహణలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమ య్యారన్నారు. నెట్ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు పేపర్ లీకేజ్ కు కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని(ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ కౌన్సిలింగ్ వెంటనే ఆపేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర విద్యా సంస్థల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు నెంబర్స్ వెంటనే విడుదల చేయాలని,నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జహీరాబాద్ ఏరియా కార్యదర్శి విష్ణువర్ధన్ నాయకులు అతీక్, పృథ్వీరాజ్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు బంద్‌లో భాగంగా మూతబడ్డాయి. డీవైఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి పరీక్షను నిర్వహించాలన్నారు. లీకేజీలపై సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలన్నారు. విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళనలపై ఉక్కు పాదం మోపుతున్నారే తప్పా.. బాధిత విద్యార్థులకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. విద్యార్థులకు ఇంత నష్టం వాటిల్లుతున్నా.. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి బీజేపీ ఎంపీలు పార్లమెంట్లో నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివ, ప్రశాంత్, రవి, రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కంగ్టి : వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కిందిదొడ్డి శివ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీనిర్వహించాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలన్నారు. ఈనెల 6న కౌన్సిలింగ్ జరిపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, ప్రశాంత్, ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ , ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బలవంత రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్‌రెడ్డి మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్‌పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలనాన్రు. కేంద్ర పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘా నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, యూనివర్సిటీల్లో స్వేచ్ఛ వక్రీకరణ ప్రజాస్వామ్యం అణిచివేత చర్యలు ఆపాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి వాణి నాయకులు శ్రీను, కార్తీక్, హరీష్, రాము,తదితలు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్‌బీఎస్, ఎన్ఎస్‌యుఐ, డీవైఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలో బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా నాయకులు నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. ఈనెల 6 తేదీన నీట్ కౌన్సిలింగ్ జరిగే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, పేపర్ నమ్ముకోవడం పైకి కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం చాలా దారుణమన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ అశోక్, ఏఐఎస్‌బీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో పేపర్ లీకేజి అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిద్ర మబ్బు వీడి విద్యార్థి లోకానికి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రకాంత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇసాక్, ఎన్ఎస్‌యుఐ నాయకులు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ పటాన్ చెరు ఏరియా నాయకుడు రవి కిరణ్ అన్నారు. పరీక్షల నిర్వహణలో ఎన్డీఏ విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారని నీట్ పరీక్షల్లో జరిగిన అవకాతవకలు పేపర్ లీకేజ్ కు కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. నీట్ కౌన్సిలింగ్ వెంటనే ఆపేయాలని.. ఇటీవల అడ్మిషన్లు భర్తీ కోసం నెట్ స్కోర్ కంపల్సరి నిబంధన చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర విద్యా సంస్థల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండిం గ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుద ల చేయాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు ఏరియా కమిటీ నాయకులు అర్జున్, సురేష్, గణేష్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళ్లు..



నవతెలంగాణ-అమీన్‌పూర్

భారత స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఎస్ఎస్ఎల్ కాలనీ చౌరస్తాలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన, బడుగు బలహీన వర్గాలను స్వాతంత్ర సమరంలో భాగస్వామ్యం చేసిన మహోన్నత నాయకుడు సీతారామరాజు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నవనీత జగదీష్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఔదార్యాన్ని చాటుకున్న ప్రభుత్వ ఉద్యోగి శ్రీనివాస్ జోషి

నవతెలంగాణ-జహీరాబాద్



వివాహ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టి జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ జోషి, పద్మిని దంపతులు ఆదర్శంగా నిలిచారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ జోషి న్యాల్కల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు 30ఏళ్ళ క్రితం పద్మిని జోషితో వివాహం జరిగింది. ఈ దంపతులు వారి 30వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మొగుడంపల్లి మండలం ధనాసిరి గ్రామంలోని భారతి శిశుమందిర్‌కు సౌండ్ సిస్టంలో భాగంగా ఒక ఆంప్లిఫయర్, రెండు స్పీకర్లు, రెండు మైకులు, రెండు స్టాండలను అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని గడ్డిబజార్‌లో గల శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలకు రూ.30వేల నగదు వితరణ చేశారు. అంతే కాకుండా తన తండ్రి పనిచేసిన ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు ఇనుప ఆల్మరాను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు వెంకటేష్ జోషి, శివాజీ జోషి, కుమార్తె హైందవి జోషిలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి



నవతెలంగాణ-జహీరాబాద్

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సాయి చరణ్ అన్నారు. గురువారం నిర్వహించిన డైరెక్టర్ల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. ఏ పని చేసినా రైతులకు మార్కెట్ కమిటీ ఉపయోగకరంగా ఉండాలని అన్నారు. దాంతో భవిష్యత్తులోలో మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. సర్వసభ్య సమావేశంలో పలు ఎజెండా అంశాలు చర్చించి ఆమోదించారు. ప్రస్తుతం గ్రేన్ మార్కెట్లో స్థలం సరిపోనందున ప్రభుత్వ స్థలం సేకరించి నూతన మార్కెట్ యార్డు నిర్మాణం చేయుటకు, గ్రేన్ మార్కెట్ యార్డులో గల పాత గోదాములను తొలగించి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌సీఈ షెడ్‌లో దుకాణాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు వంశి రాజ్, కండెం సుజాతా, జాఫర్, బోయిని శేఖర్, అఖీల్ అహ్మద్, శంకర్ పాటిల్, మార్కెట్ కార్యదర్శి అనిల్, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు 'రైతు భరోసా' అందిస్తాం

నవతెలంగాణ-పుల్కల్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకాన్ని ప్రతి ఒక్కరికి చేరే విధంగా తమవంతు కృషి చేస్తామని పుల్కల్ ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ అనంతరావు కులకర్ణి అన్నారు. పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న సహకార సంఘం ఎదుట గురువారం రైతు భరోసా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా డీసీఓ తుమ్మల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు రైతుభరోసా పథకాన్ని అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమకు రైతు భరోసా ఎప్పుడు వస్తుందని రైతులు అడిగారు. అందుకు అధికారులు స్పందిస్తూ రైతు భరోసా పథకాన్ని వర్తింప చేస్తామన్నారు. పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పుల్కల్ మండల వ్యవసాయ అధికారి చైతన్య, ఏడీఓ అరుణ, సీఈఓ నాగయ్య, డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

నవతెలంగాణ-జిన్నారం



నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాదికర సంస్థ సెక్రటరి, సీనియర్ జడ్జి రమేశ్ సూచించారు. జిల్లా న్యాయ సేవాదికర సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో మహిళా సాధికారత కేంద్రం భేటీ బచావో- భేటీ పడావో అధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక సంయుక్త అవగాహన కార్యక్రమ శిబిరాన్ని మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్ లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేశ్ మాట్లాడుతూ.. నూతన చట్టాలు, శిక్షనా తదితర అంశాలపై విద్యార్థి బృందాలకు వివరించారు. లక్ష సిద్ధికే కృషి చేయాలన్నారు. కెరియర్ గైడెన్స్, సైబర్ క్రైమ్ మాదక ద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుండి వచ్చే సమస్యలను తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎస్సై విజయరావు మాట్లాడుతూ.. జులై 2024 నుంచి అమలవుతున్న కొత్త చట్టాలు నార్కోటిక్ డ్రగ్స్, సైబర్ నేరాలు ఫోక్సో చట్టాలు, షీ టీమ్స్ సేవలు తదితర అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా పరంగా జాగ్రత్త గా ఉండాలని, మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించి చదువు మీద దృష్టి పెట్టాలని సూచించారు. బాల్య వివాహాలు,అక్రమ రవాణా తదితర అంశాలపై లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ పల్లవి మాట్లాడుతూ.. మహిళల బాలికల రక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. తప్పు చేసిన వారికి చట్టం కచ్చితంగా శిక్ష వేస్తుందని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఉత్తమ ఆలోచన దృక్పథంతో మంచిదారిలో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. బాల బాలికలు ఇద్దరికీ సమాన అవకాశాలు హక్కులు ఉన్నాయని.. మహిళలు బాలికల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపాల్ , మధుసూదన్ రెడ్డి, గాయత్రి కళాశాల సిబ్బంది విద్యార్థి బృందాలు పాల్గొన్నారు.

హెవీ వెహికిల్స్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు..



నవతెలంగాణ-కంది

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని శివసాయి, మంజీరా కాలనీలకు వెళ్లే రోడ్లను ధ్వంసం చేస్తున్న ఓం శ్రీ కర్ని టైల్స్ గ్రానైట్ ఓనర్‌పై చర్యలు తీసుకోవాలని మంజీరా కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గ్రానైట్ షాప్ ఎదుట ధ్వంసమైన రోడ్డును కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు వి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి అతిమేల మాణిక్ గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రానైట్ షాప్ యాజమాన్యం పెద్ద లోడ్ లారీలను రోడ్డుపై నిలపడంతో.. రోడ్డు గుంతలు పడుతుంది. రోడ్డుకు అడ్డంగా లారీలను నిలపడంతో కాలనీలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. బురదలో నుంచి వెళ్లడం వలన వాహనాలపై వెళ్తున్న వాళ్ళు కింద పడి గాయాలు కూడా అవుతున్నాయన్నారు. రోడ్డు పై కనీస జాగ్రత్తలు కూడా షాప్ యాజమాన్యం పాటించడం లేదన్నారు. షాప్ యాజమాన్యానికి వ్యాపార లావాదేవీలపై ఉన్న శ్రద్ధ ప్రజారోడ్డు పై లేదన్నారు. గ్రామ పంచాయతీ పాలక మండలి గ్రానైట్ షాప్‌లకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారన్నారన్నారు. రోడ్డును ధ్వంసం అయ్యేలా చేసిన గ్రానైట్ షాప్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని, రోడ్డుకు మరమ్మత్తులు చేయాలన్నారు. లేని యెడల జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన్నె వెంకట్, రమేష్, నర్సింలు, అడివయ్య సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షాన పోరాడిన వీరుడు 'దొడ్డి కొమురయ్య'

నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారని.. ఆయన 78వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ అధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మానిక్ మాట్లాడుతూ.. రజాకారులు, భూస్వాములు నిర్వహించిన ఆగడాలను కాల్చి బూడిద చేసిన మహనీయుడు దొడ్డి కొమరయ్య అన్నారు. వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అగ్గి రాజేశారన్నారు. జమీందార్ల దేశముకుల ఆగడాలను నిద్ర లేకుండా చేశాడన్నారు. కూలీ రేట్లు పెంచాలని, పేదలకు భూములు పంచాలని రజాకార్లకు వ్యతిరేకంగా పెట్టి చాకిరి నిర్మూలించాలని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించినట్టు గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. దొడ్డి కొమరయ్య తుపాకి గుళ్ళకు బలయ్యాడని అన్నారు. భూస్వాముల గుండాల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రజలు గొడ్డలి, పారా, ఒడిసెలు లాంటివి పట్టుకొని పోరాటాన్ని నిర్వహించారన్నారు. ఈ పోరాటాన్ని కొంతమంది మతోన్మాదులు మతం రంగు పొలిమి వక్రీకరించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దాన్ని తెలంగాణ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సహించటానికి వీల్లేదన్నారు. పేదల కోసం తన ప్రాణాలను బలిదానం చేసిన దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పేద ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రజలను చైతన్యం చేయటానికి సీపీఐ(ఎం) ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, నాయకులు రాజయ్య, కృష్ణ, వాణి తది తరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆత్మీయ కలయిక

నవతెలంగాణ-తూప్రాన్



ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభం నుంచి పనిచేసిన ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా సీనియర్ నాయకులు మాసాయిపేట వాస్తవ్యులు గుడ్డి కృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మార్పీఎస్ తో పాటు దళితులకు వారు చేసిన సేవలను, త్యాగాలను, ఉద్యమ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీఎస్ ప్రారంభ సమయం నుంచి ఇప్పటివరకు ఉద్యమంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల జీవిత చరిత్రను,వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని ఒక పుస్తక రూపంలో ముద్రించబడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమం ద్వారా ఎమ్మార్పీఎస్ నాయకుల యొక్క బాగోగులు తెలుసుకొని వారికి అండగా ఎమ్మార్పీఎస్ నాయకత్వం ఉంటుందన్నారు.దళితుల సమస్యలపై ఎప్పటికప్పుడు నిర్విరామంగా ఉద్యమం చేస్తామన్నారు.ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి, జిల్లా నాయకులు సర్గల రాములు , ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడ్డి కృష్ణ, కాలకంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నూతన తెలుగు దినపత్రిక

మెదక్

3

శుక్రవారం | 05 జులై 2024 | www.navatelangana.com

జీలుగు పంట పరిశీలన

జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ- నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామంలో రైతులు వేసినటువంటి పచ్చిరొట్టె పంట జీలుగను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద సందర్శించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్టె పంటలను పండించి భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో పోషకాలు పెరిగి పంటల దిగుబడి పెరుగుతుందని, రసాయన ఎరువుల వాడకం తగ్గి రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయాన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు రైతులతో ఈ వర్షాకాలంలో వేస్తున్నటువంటి వివిధ పంటల యజమాన్య పద్ధతుల గూర్చి, ఎరువుల యాజమాన్యం పద్ధతుల గురించీ చర్చించాడు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజనారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీలత, కావేరి , గ్రామ రైతులు గెల్లు శ్రీశైలం, చందు , బుచ్చ మల్లేశం, తధితరులు పాల్గొన్నారు

బాధ్యతాయుతంగా పని చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

నవతెలంగాణ-టేక్మాల్



ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతా యుతంగా పని చేయాలని, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. గురువారం టేక్మాల్ లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నానంతరం మాట్లాడారు. గురువారంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒకరికొకరు సాయ సహకారాలు అందించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. తక్షణ మరమ్మతుల కోసం నిధులు ఉన్నాయని, ఎక్కడ కూడా రాజీపడకుండా పనులు చేసి అభివృద్ధి కొంటు పడకుండా చూడాలని, కార్యదర్శుల ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాలలో నాయకుల సాయ సహకారాలు తీసుకొని పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీపీ చింత స్వప్న, రవి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ షేక్ మజార్, ఎంపీటీసీ వాణి రమేష్, రమాబాయి, నాయకులు వీరన్న, సిద్దన్న, భాస్కర్, గోవింద చారి, సలీం, తదితరులు ఉన్నారు

కామ్రేడ్ దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



హవేలీ ఘనపూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, కామ్రేడ్ దొడ్డి కొమురయ్య, 78వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి, పూల మాలలు వేసి ఘనంగా గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం మాట్లాడుతూ. భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తి కొమురయ్య, పరసా శివరాజు, మైపాల్, గోరంట్ల జక్కయ్య శ్రీశైలం, బీరప్ప, నర్సింలు బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ రూరల్ సీఐగా రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్ రూరల్



మెదక్ రూరల్ సీఐగా రాజశేఖర్ రెడ్డి, బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన, కేశవులు ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నిజాంబాద్‌లో విధులు నిర్వహించిన రాజశేఖర్ రెడ్డి ఇక్కడికి వచ్చారు.

మండల ప్రత్యేకాధికారిగా గోవింద్

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పదవి కాలం ముగిసినందున వారి స్థానంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది గోవింద్‌ను శాలవాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వినయ్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నర్సింలు, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా డీఎం హరికృష్ణ

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



పేట మండల ప్రత్యేక అధికారిగా సివిల్ సప్లై డీఎం హరికృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫిక్ ఉన్నిసా పాల్గొన్నారు.

సాయుధ పోరాట తొలి అమరుడు కొమురయ్య

జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ

నవతెలంగాణ-మెదక్ టౌన్



తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య గురు వారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యం లో ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, విముక్తి పోరాడిన మహనీయుడు కొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చే వ్యక్తి దొడ్డి కొమురయ్యనేనని ఆయన పేర్కొన్నారు. దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడని, వరంగల్ జిల్లాలో సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య తెలంగాణ మహోన్నత ఉద్యమానికి ఆద్యుడయ్యాడన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోశారని కొమురయ్య ఆశయాలను నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బీసీ సంక్షేమ అధికారి నాగరాజు, పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


నవతెలంగాణ-నర్సాపూర్



బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం హుస్నాబాద్‌లో నర్సాపూర్‌కు చెందిన, కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, అదేవిధంగా మహాలక్ష్మీ పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు కొత్త బస్సు సౌకర్యాలు కల్పించాలని మంత్రిని కోరామన్నారు. నూతనంగా ఏర్పడిన మండలాలకు గురుకుల విద్యాలయా ఏర్పాటు చేయాలని కోరగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పీఏసీఎస్ చైర్మన్‌లు రాజు యాదవ్, వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మల్లేశం, గంగాధర్ ఉన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం

నవతెలంగాణ-తూప్రాన్



జూలై 5వ తేదీన టీఎన్జీవో భవన్‌లో ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి అన్నారు. ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లాలో 21 మండలాల్లో ఉన్న 3 డివిజనలో పరిధిలో జులై 7వ తేదీన ప్రతి గ్రామ,మండలంలో ఎమ్మార్పీఎస్ జండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నూతన జిల్లా కమిటీ అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాట్లాడుతూ జెండా పండుగలు జరుపుకోవడానికి దిశా నిర్దేశ చేయడానికి సమీక్ష సమావేశం 2024 జూలై 5వ తేదీ, శుక్రవారం జిల్లా టీఎన్జీవో భవన్ మెదక్ లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశానికి మెదక్ జిల్లాలో ఉన్న 21 మండలాలు, 3 డివిజన్లకు సంబంధించిన ఎమ్మార్పీఎస్ నాయకుల, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్





నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కేంద్రంలో విద్యాసంస్థల బంధు విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు అజయ్ కుమార్ అన్నారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ, విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారని నీట్, నెట్‌పరీక్షల్లో జరిగిన అవకాతవకలు పేపర్ లీకేజీకు కేంద్ర బింధువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్టీఏ పని తీరు నీట్, నెట్ పరీక్షలు అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ గురువారం విద్యాసంస్థలు బంధు నిర్వహించి జిల్లా కేంద్రము న్యాయమైన, సమర్థమైన పరీక్ష విధానాన్ని నిర్వహించడంలో ఎన్డీఏ ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరంతర ప్రశ్నాపత్రాల లీకేజీ పరీక్షల వాయిద్యాల్లో ఇది స్పష్టంగా కనిపించిందన్నారు. తమ డిమాండ్‌లు నెరవేరే వరకు పోరాటం చేస్తామన్నారు. ఎక్కడ విద్యార్థులుకు అన్యాయం జరిగిన తమ పోరాటం కొనసాగుతుంటుందని హెచ్చరించారు. ఇండియన్ రద్దు చేయాలని డిమాండ్‌తోని, ఈరోజు విద్యాసంస్థల బంధు నిర్వహించిందన్నారు. ఇది సంఘ పరిహార ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో విద్యార్థులు చేస్తున్న పోరాటమని స్పష్టం చేశారు. యూజీసీ కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్డీఏ దేశంలోని లక్షణాలది మంది విద్యార్థుల జీవితాలతో పదేపదే ఆడుకుంటుందన్నారు. 2017లో ఎన్టీఆర్ ప్రవేశపెట్టడంతో విద్య కేంద్రీకరణ ఎజెండాను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించిందని గుర్తుకు చేశారు. ఇది పూర్తిగా విఫలమైందని స్పష్టమైన తర్వాతే దాన్ని కూడా తొలగించడానికి ఎందుకు వెనకడుగుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ పరీక్షల సమగ్ర కృషి చేయాలని, విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. ప్రభుత్వ హక్కులు లాగేసుకొని విద్యపై పూర్తిగా నియంత్రణ కోసం కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. నీట్ కౌన్సెలింగ్ వెంటనే ఆపేయాలని ఇటీవల అడ్మిషన్లు భర్తీకై నెట్ స్కోర్ తప్పనరి నిబంధన రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు దోపిడీకి నియంత్రణ చట్టం వేసి అధిక ఫీజుల నియంత్రణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, పీవైఎల్ జిల్లా కన్వీనర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీటీసీల వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-నార్సింగి



రాష్ట్రంలో జెడ్పీటీసి, ఎంపీటీసీల పదవీ కాలం గురువారం ముగిసింది. నార్సింగి జెడ్పీటీసి బాణాపురం కృష్ణా రెడ్డి వీడ్కోలు సమావేశాన్ని గురువారం చెగుంట మండల పరిధిలోని కర్ణంపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి నార్సింగి మండలం నుంచి కాకుండా పరిసర మండలాలైన చేగుంట, చిన్న శంకరం పేట్ నుంచి కూడా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసికి శాలువాలతో, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీటీసి మాట్లాడుతూ స్థానిక సంస్థల సభ్యుల పాలనా గడువు గురువారంతో ముగిసిందని తెలిపారు. ఈ ఐదేళ్ళ పాలనా కాలంలో ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు లభించిందని, మండల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేశానని, అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందించానని పేర్కొన్నారు. తన పదవీ కాలం తనకు సంతృప్తి నిచ్చిందని, మండలానికి చాలా చేసానని, చేయాల్సింది, ఇంకా చాల ఉందని, భవిష్యత్తులో అవకాశం ఇస్తే ఇంకా అభివృద్ధి పనులు చేస్తామ న్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ప్రస్తుత ఎంఎల్ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసి చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్ అన్ని విధాలుగా సహకరించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండల, గ్రామాల నాయకులు, ప్రజలు, పత్రికా విలేఖరులు సైతం సహకారం అందించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా రెడ్డి భవిష్యత్తులో ఇంకా పెద్ద పదవులను అధిరోహించాలని, ఇంకా ఎత్తుకు ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, శంకరంపేట్ నాయకుడు పట్లూరి రాజు, చెగుంట ఎంపీటీసీ శ్రీనివాస్, పెద్ద తాండా తాజా మాజీ సర్పంచ్ చత్రియా నాయక్, పెద్ద తాండా పార్టీ అధ్యక్షుడు భాషా నాయక్, వల్లూరు పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ వహీద్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేష్ గౌడ్, రాయిలాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడలో నడవాలి

నవతెలంగాణ-టేక్మాల్



మహనీయుల అడుగుజాడలో నడవాలని, మైనార్టీ హక్కుల పరిరక్షణ జిల్లా కార్యదర్శి ఎంఏ సలీం అన్నారు. గురువారం టేక్మాల్ మండల పరిషత్ ఆవరణంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. టేక్మాల్ మండల పరిషత్ పాలక సభ్యుల పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న సాహసం రాష్ట్ర అధ్యక్షులు డా.ముప్పారం ప్రకాశం పాల్గొని మాట్లాడుతూ, ఈ దేశానికి రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందిస్తే ఆ రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేయించడం కోసం అహర్నిశలు కృషి చేసింది, డాక్టర్ బాబు జగ్జీవన్ రావుని కొనియాడారు. నేటితో టేక్మాల్ మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీల పదవీకాలం ముగియడంతో ఆ ప్రజాప్రతినిధులను గ్రామ ఆదర్శ యువజన సంఘం, గ్రామ పెద్దల సమక్షంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల పదవీ కాలాన్ని పురస్కరించుకొని కృతజ్ఞతగా ఈ దేశ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఈ దేశ తొలి బహుజన ఉపప్రధాని అయిన డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్‌ల యొక్క విగ్రహాలను ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో నేడు ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులతో పాటు అతిధులను పూలమాలలు, శాలువాలతో సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింత స్వప్నా రవి, నిమ్మ రమేష్, వాణి, కోఆప్షన్ సభ్యులు మాజార్, భక్తుల వీరప్ప, నాయి కోటి సుప్రజా భాస్కర్, కమ్మరి సిద్ధయ్య, గోవిందా చారి, పాపయ్య, అవినాష్ కుమార్, ఆదర్శ యువజన సంఘం సభ్యులు, నాయకులు రమేష్ భాస్కర్ శివ రవి కిరణ్ కుమార్, కమలాకర్ నరేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తూ యాదగిరిగుట్టకు సిద్ధిరాములు

నవతెలంగాణ-తూప్రాన్



పాదయాత్ర చేస్తూ యాదగిరిగుట్టకు బయలుదేరిన సిద్ధిరాములు యాదవ్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పాటు, మూడవసారి భారత ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టారని, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడంతోపాటు, మెదక్ ఎంపీగా మధు మాధవనేని రఘునందన్ రావు, గెలుపొందిన సందర్భంగా మొక్కిన మొక్కును తీర్చుకోవడానికి తూప్రాన్ మండలానికి చెందిన జండాపల్లి గ్రామంలో ఉన్న వీర హనుమాన్ మందిరంలో ఉదయం 10:30 నిమిషాలకు పూజలు నిర్వహించి, పాదయాత్రగా బీజేపీ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సిద్ధిరాములు యాదవ్ యాదగిరిగుట్టకు బయలుదేరారు. దేశంలో మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో కాషాయ జెండా రెపరెపలాడంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఇష్ట దైవానికి మొక్కులు చెల్లించుకోవడానికి పాదయాత్రగా యాదగిరిగుట్టకు బయలుదేరారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని, మెదక్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని తెలిపారు. యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రఘునందన్ రావు, మెదక్ ఎంపీగా గెలవడం మెదక్ ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కావేరి గారి మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, పెద్ద ఎలుక శ్రీధర్ రెడ్డి, కొడకండ్ల రవీందర్ రెడ్డి, నారాయణరెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చోళ రామ్ చరణ్ యాదవ్, వెంగలి వెంకటేష్, వెంగలి ప్రభాకర్, నరసింహారెడ్డి, బండ మల్లేశం, తూప్రాన్ మున్సిపల్ బీజేపీ పట్టణ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్, కౌన్సిలర్ జమాల్పూర్ లక్ష్మీ నర్సోజి, ఆడెపు మధుసూదన్, పోతురాజు నాగరాజు, వినయ్, కొండ మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండ్ల తోటలను పెంచాలి

నవతెలంగాణ-టేక్మాల్





గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులు పండ్ల తోటలు పెంచి ఎక్కువ ఆదాయాన్ని పొందాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాసరావు సూచించారు. గురువారం టేక్మాల్ మండలంలోని కుసంగి, మల్కాపూర్ గ్రామాలలో సందర్శించి పండ్ల తోటల పెంపకం పిట్టింగ్ పనులను వాటర్ షెడ్‌లో చేసిన పనులను చూసారు. మల్కాపూర్‌లో నర్సరీని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలకు, ఇజిఎస్ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ మాట్లాడుతూ, ఈ పథకంలో వ్యసాయ ఆధారిత పనులైన పండ్ల తోటల పెంపకం, కాలువల మరమ్మత్తు, భూగర్భ జలాలు పెంచే ఫాంపాండ్, వాతావరణ సమతుల్యం కాపాడడానికి మొక్కలు నాటడంతో, పాటు 261 పనులు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రతీ ఒక్క ఉద్యోగి గ్రామంలో ఎన్ని మంచి పనులు చేశారు, ఎంత ఆదాయాన్ని సృష్టించాను, అనే దృఢ సంకల్పంతో విజయాల దిశగా పనిచేయాలని, అప్పుడే గ్రామానికి, మీకు మంచి పేరు వస్తుందన్నారు. సమయాన్ని వృధా చేయవద్దని ఒక గోల్‌తో పని చేస్తేనే మీ జీవితానికి పుణ్యం పురుషార్థం లభిస్తుందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రియాజోద్దీన్, వాటర్ షెడ్ ప్రోగ్రాం ఆఫీసర్ శశిరేఖ, ఏపిఓ పాల్, పంచాయతీ కార్యదర్శులు, ఇసి బాలరాజ్, టిఏ రాజశేఖర్, గంగారాం, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గౌతాపూర్ విద్యార్థి

నవతెలంగాణ-చిలిపిచేడ్



మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన, విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్, గౌతాపూర్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆర్.అజయ్ లాంగ్ జంప్ నందు పాల్గొని, ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి, 7వ. తేది నాడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం నందు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. 100మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి పొందడం జరిగింది. అతనితో పాటు ఆర్. జగదీశ్ లాంగ్ జంప్ నందు తృతీయ బహుమతి, హరీష్ 100మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి జీ.హారిక 600 మీటర్ల పరుగు పందెంలో తృతీయ బహుమతి, ఇ.సాయికిరణ్100మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతులు పొందడం జరిగింది. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందిస్తూ, ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాలలో క్రీడా ఉల్లాసం పెంచేలా, పిఈటి, టీచర్ సత్యం ప్రోత్సాహంతోనే విద్యార్థులకు క్రీడనైపుణ్యంలో ముందుకు సాగుతున్నారని పిటి సత్యం అభినందించారు.

మండల ప్రత్యేక అధికారిగా జెడ్పీ సీఈవో ఎల్లయ్య

నవతెలంగాణ-తూప్రాన్



మండల ప్రత్యేక అధికారిగా జెడ్పీ సీఈవో సిహెచ్ ఎల్లయ్య నియామకమయ్యారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎంపీపీలు, ఎంపీటీసీల ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసిన తర్వాత మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల స్థానంలో మండల ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న సిహెచ్ ఎల్లయ్యను తూప్రాన్ మండల ప్రత్యేక అధికారిగా నియమించారు. ఎంపీపీ, మండల ప్రాదేశిక సభ్యుల 5 సంవత్సరాల పదవీ కాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారుల నియామకం తప్పనిసరి అయింది. మండల అభివృద్ధి అధికారులకంటే పైస్థాయి కేడర్ కలిగిన అధికారులను మాత్రమే మండల ప్రత్యేక అధికారులుగా నియమించారు. మండల ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారికి సౌకర్యాలు కల్పించాలని, మండల అభివృద్ధి అధికారులకు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

సబ్సిడీ లేని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు ఎందుకు....?

- సబ్సిడీపై ఎరువులను, విత్తనాలను అందజేయాలి

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము రైతులకు సబ్సిడీపై విత్తనాలను, ఎరువులను అందజేయాలనే ఉద్దేశంతో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలను నెల్కోల్పారని మండలంలోని రైతులన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో నిర్వాహకులను సబ్సిడీపై విత్తనాలను, ఎరువులను ఇవ్వాలని అడగగా ప్రభుత్వము ఎలాంటి సబ్సిడీలు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము రైతులకు సబ్సిడీపై విత్తనాలను, ఎరువులను అందజేయాలని రైతులు కోరుతున్నారు. సబ్సిడీపై ఎరువులను, విత్తనాలను అందజేయని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు ఎందుకని? రైతులు వాపోతున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి రైతులకు సబ్సిడీపై ఎరువులను, విత్తనాలను అందజేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణను వివరణ కోరగా ప్రభుత్వము ఎలాంటి సబ్సిడీలు ఇవ్వడం లేదని కేవలం జీగురు విత్తనాలకు మాత్రమే సబ్సిడీ ఇచ్చిందన్నారు. సబ్సిడీపై ఎరువులను, విత్తనాలను ప్రభుత్వము పంపిణీ చేసినప్పుడు తప్పకుండా రైతులకు అందజేస్తామన్నారు.

తొలి మున్సిపల్ మాజీ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ- తూప్రాన్



తూప్రాన్ తొలి మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రజినీ, రవీందర్ గౌడ్‌లకు ఇరువై ఐదేండ్ల పెళ్లిరోజు జరుపుకుంటున్న తూప్రాన్ తొలి మున్సిపల్ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్ దంపతులకు తూప్రాన్ మున్సిపాలిటీ చెందిన మూడో వార్డు కౌన్సిలర్ బైరం ఉమా సత్య లింగం, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు సామల అశోక్, కోరబోయిన ప్రవీణ్ కుమార్, పోచెందర్, దొంతి రాజేశ్వర్, శేరి నవీన్ కుమార్‌లు కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ బైరం ఉమా సత్యలింగం మాట్లాడుతూ ఆదర్శ, పుణ్య దంపతులైన బొంది రజిని, రవీందర్‌గౌడ్‌లు నిండునూరేళ్ళు, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. తూప్రాన్ మున్సిపాలిటీ ప్రజలకు భవిష్యత్తులో మరిన్ని సేవలు చేసే అవకాశం కల్పించాలని భగవంతుడిని కోరారు. తూప్రాన్ మున్సిపాలిటీకి తొలి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొని, ప్రజల మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ బైరం ఉమా సత్యలింగం, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు సామల అశోక్, కోరబోయిన ప్రవీణ్ కుమార్, పోచెందర్, దొంతి రాజేశ్వర్, శేరి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట



ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన, సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన కథనం ప్రకారం కొడిపల్లి గ్రామానికి చెందిన, బర్ల రాజు (28) ఓ ఛానల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. గురువారం మిత్రులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం ఆలయ సమీపంలోని ఘనపురం ఆనకట్ట వద్దకు వెళ్లి స్నేహితులు ప్రాజెక్టుపై ఉండగా రాజు స్నానం చేసేందుకు నీటిలోకి దిగాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలించగా, నీటిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం, మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బూదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


విద్యాసంస్థల బంద్ విజయవంతం

నవతెలంగాణ-నర్సాపూర్



కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్‌తో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ సంఘాల ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ గురువారం విజయవంతం అయింది. అయితే కొన్ని విద్యాసంస్థలు ముందుగానే బందు పాటించగా మరికొన్ని విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు వేరువేరుగా తిరుగుతూ బందు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యూఐ నాయకులు పాల్గొన్నారు.

సబ్బు బిళ్ళ మీద అల్లూరి చిత్రం



నవతెలంగాణ-గజ్వేల్

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని సబ్బుబిళ్ల మీద అల్లూరి చిత్రాన్ని అద్భుతంగా చిత్రీకరించి ఘనంగా నివాళులు అర్పించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాద గుండెల్లో వణుకు పుట్టించిన మన్యం విప్లవ వీరుడు యువతకు స్ఫూర్తి ప్రధాత తెలుగు తేజం అల్లూరి సీతారామరాజు అన్నారు. మన్యసీమ గాండ్రించిన మొనగాడు, తెల్ల దొరలను అడలించిన తెలుగుతల్లి బిడ్డడు మన అల్లూరి సీతారామరాజే అన్నారు.


ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన తాడూరి దివ్య, కరుణాకర్, ఇద్దరు భార్య భర్తలు మృతి చెందడంతో అనాధలుగా మారిన ఇద్దరు కుమారులు శివ, శశి, లకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కిరణ్ కుమార్ గౌడ్, వారిని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పిల్లలకు, భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఏడీఏ రాధిక




నవ తెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా ఏడీఏ రాధిక, గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్ పాల్గొన్నారు.

ఇంగ్లీష్ టీచర్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రిన్సిపాల్ భారతి



నవ తెలంగాణ- మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఇంగ్లీష్ అధ్యాపక దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రిన్సిపల్ భారతి తెలిపారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ, పాఠశాలలో 6, 7, 8 తరగతులకు ఇంగ్లీష్ బోధనకు ఉపాధ్యాయుడు లేక పోస్టు ఖాళీగా ఉంది. డిగ్రీ బీఎడ్ చేసిన ఆసక్తిగల అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సోమవారం రోజున డెమో నిర్వహించడంతోపాటు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు.

అంగన్వాడిలో బరువుల మేళా

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణంలోని పదవ వార్డు సుభాష్ నగర్ 1,2 వ అంగన్వాడి సెంటర్లలో బరువుల మేళా నిర్వహించినట్లు వార్డ్ కౌన్సిలర్ బింగి బాలలక్ష్మీ రాజేశం తెలిపారు. గురువారం బాలలక్ష్మీ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా వచ్చే సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవ తెలంగాణ - సిద్దిపేట

స్థానిక ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 6వ తేదీన ఎంఎస్ఎన్ ల్యాబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ల్యాబ్ ప్రతినిధి మోహన్ తెలిపారు. గురువారం మోహన్ మాట్లాడుతూ డిగ్రీ కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా కలిగి, 2021 - 2024 మధ్య డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు దీనికి అర్హులు అని తెలిపారు. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటల వరకు సంబంధిత సర్టిఫికెట్స్ తో హాజరు కావాలని సూచించారు.

మండల ప్రత్యేక అధికారిగా దేవికి దేవి

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండల ప్రత్యేక అధికారిగా దేవికి దేవి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో భాధ్యతలను చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారిగా ఉన్న దేవికి దేవికి నంగునూరు మండల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, దేవికికి స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందజేశారు.ఈ కార్యక్రమంలో నంగునూరు పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, ఈజీఎస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోర్ ప్రారంభంతో నీటి సమస్య పరిష్కారం

నవ తెలంగాణ - సిద్దిపేట



7వ వార్డు లోని ఎన్టీఆర్ నగర్‌లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ బోర్ వేయించి ప్రారంభించడం జరిగిందని వార్డు కౌన్సిలర్ శ్రీదేవి బుచ్చి రెడ్డి తెలిపారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణతో కలిసి, వార్డుల పర్యటించి వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు భూమేష్, హబ్బుఖాన్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి ఘనంగా వీడ్కోలు

ఆత్మీయ సన్మానం చేసిన బేగంపేట యువకులు


నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని బేగంపేట ఎంపీటీసీ పోతిరెడ్డి స్రవంతికి గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం బేగంపేట గ్రామంలోని యువకులు, కాంగ్రెస్ శ్రేణులు ఎంపీటీసీ స్రవంతి దంపతులకు శాలువ కప్పి ఆత్మీయ సన్మానం చేశారు. ప్రజాప్రతినిధిగా ప్రజలు ఎన్నుకోవడంతో బాధ్యతను పెంచిందని ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎంపీటీసీ స్రవంతి కోరారు. ఎంపీటీసీగా ఆదరించిన బేగంపేట పరిధిలోని ప్రజలకు స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.

నవోదయ పాఠశాలకు ఎంపిక

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన బూసిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు కత్తుల రాంరెడ్డి తెలియజేశారు. 2024-2025 సంవత్సారానికి రెండో విడత ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారని తెలిపారు. నవోదయ పాఠశాలకు ఎంపికైన హర్షవర్ధన్ రెడ్డిని ఉపాధ్యాయులు రాజిరెడ్డి, నారాయణరెడ్డిలు అభినందించారు.

దొడ్డి కొమురయ్య వర్థంతి వేడుకలు

నవతెలంగాణ -నంగునూరు



తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, నైజాం తూటాలకు నేలకొరిగిన తెలంగాణ తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య అడుగు జాడల్లో నడవాలని నంగునూరు మండల కురుమ సంఘం అధ్యక్షుడు బెదురు తిరుపతి సూచించారు. గురువారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 78 వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ నిజాం నిరంకుశ వెట్టి చాకిరి పాలనకు వ్యతిరేకంగా పోరాడి తుపాకీ గుండుకు నెలకొరిగిన ఉద్యమకారుడు, తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు నకిర్తి ఎల్లయ్య, నకిర్తి రాజమల్లు, కొలుపుల ఆంజనేయులు, బెదురు నర్సింలు, కొన్నె సంపత్, బెదురు కైలాస్, కడవ అజయ్, ఎట్ల రాజు, బెదురు వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్ నుండి త్రిపుల్ ఐటీ ప్రవేశానికి ఎంపికైన 9 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మోడల్ స్కూల్ ఆర్.రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించి నట్లయితే మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్ళుతారన్నారు.అలేఖ్య, శశి పవన్, శ్రావణి, అభిజ్ఞ, త్రిపుర, ధనుష్, మీనాక్షీ, కృతిక, అశ్విత్‌లు త్రిపుల్ ఐటీ కి ఎంపికైనందున తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి అభినందనలు తెలియజేశారు.

కొమురయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవ తెలంగా-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రైతంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య గారి స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నిజాం రజాకార్లు ఆగడాలకు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమిక కావాలని, వెట్టిచాకిరి విముక్తి పొందాలని తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటాలు కొనసాగుతున్నాయి. కడవండి గ్రామంలో రజాక కార్లు జాగిర్దారులకు వ్యతిరేకంగా భూసిస్తుకు, కౌలుకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దున్నేవాడి చేతుల్లోనే భూమి ఉండాలని నైజాం రజాకర్ల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 4వ తేదీన నిరసన ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా ర్యాలీలో ముందు భాగాన నిలబడ్డ దొడ్డి కొమరయ్య భూస్వాములు తుపాకులతో కాల్పులు జరపగా తుపాకీ గుండ్లకు దొడ్డి కొమరయ్య అమరుడయ్యారు. ఆనాడు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దున్నే వాడికి భూమి కావాలని దొరల ఆగడాల అరికట్టాలని మహత్తర పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య నేటికీ స్ఫూర్తిదాయకమని ఆయన స్ఫూర్తితో నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దోపిడికి క్రీడలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మిస్తామని అందరికీ అన్ని రకాల సౌకర్యాల కల్పన కోసం సీపీఐ(ఎం) కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, బండ కింది అరుణ్ కుమార్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్ నాయకులు కొండం సంజీవ్ కుమార్, నారాయణ, అభి తదితరులు పాల్గొన్నారు



విద్యాసంస్థల బంద్ విజయవంతం

- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్











నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండల కేంద్రంలో విద్యాసంస్థల బంధు విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కోనేరు ప్రవీణ్, నాచారం శేఖర్ అన్నారు. గురువారం విద్యాసంస్థల బందులో భాగంగా పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ, విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారని నీట్ నెట్ పరీక్షల్లో జరిగిన అవకాతవకలు పేపర్ లీకేజ్‌కు కేంద్ర బింధువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్టీఏ పనితీరు నీట్ నెట్ పరీక్షలు అక్రమాలు, పేపర్ లీకేజ్‌ని వ్యతిరేకిస్తూ గురువారం విద్యాసంస్థలు బంధు నిర్వహించారు. న్యాయమైన, సమర్థమైన పరీక్ష విధానాన్ని నిర్వహించడంలో ఎన్డీఏ ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరంతర ప్రశ్నాపత్రాల లీకేజీ పరీక్షల వాయిదాల్లో ఇది స్పష్టంగా కనిపించిందన్నారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం చేస్తామన్నారు. ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగిన తమ పోరాటం కొనసాగు ఉంటుందని హెచ్చరించారు. ఇండియన్ రద్దు చేయాలని డిమాండ్‌తో ఈరోజు విద్యాసంస్థల బంధు నిర్వహించిందన్నారు. ఇది సంఘ పరిహార ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో విద్యార్థులు చేస్తున్న పోరాటమని స్పష్టం చేశారు. యూజీసీ కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్టీఏ దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో పదేపదే ఆడుకుంటుందన్నారు. 2017లో ఎన్టీఆర్ ప్రవేశపెట్టడంతో విద్య కేంద్రీకరణ ఎజెండను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించిందని గుర్తుకు చేశారు. ఇది పూర్తిగా విఫలమైందని స్పష్టమైన తర్వాతే దాన్ని కూడా తొలగించడానికి ఎందుకు వెనకడుగుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ పరీక్షల సమగ్ర కృషి చేయాలని విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. ప్రభుత్వ హక్కులు లాగేసుకొని విద్యపై పూర్తిగా నియంత్రణ కోసం కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. నీట్ కౌన్సెలింగ్ వెంటనే ఆపేయాలని ఇటీవల అడ్మిషన్లు భర్తీకై నెట్ స్కోర్ తప్పసరి నిబంధన రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలనన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదలచేయాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు దోపిడీకి నియంత్రణ చట్టం చేసి అధిక ఫీజుల నియంత్రణ చేయాలన్నారు. స్కాలర్షిప్ల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు ప్రణయ్, నాయకులు శేఖర్, లోకేష్, ప్రవీణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎంబీబీఎస్ చదవటానికి రాసే జాతీయస్థాయి ఎంట్రెన్స్ ఎగ్జామ్ అయినటువంటి నీట్ పేపర్ లీకేజ్‌కు నిరసన ఎన్ఎస్‌యూఐ జాతీయస్థాయిలో బందుకు పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ బందు సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తరగతులను బహిష్కరించి కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద దహనం చేయడం జరిగింది. నీట్ లీకేజ్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంటులో రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే దాన్ని పట్టించుకోకుండా సభను తప్పుదారి పట్టిస్తున్న ఈ మోడీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాల్సిన సమయం ఆసన్నమైంది. విద్యార్థులు ఏకమై మోడీ ప్రభుత్వం చేస్తున్నా విద్యార్థుల వ్యతిరేకత చర్యలపై విద్యార్థుల యువత ఏకమై మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, విద్యార్థి సంఘ నాయకులు సర్దార్ ఖాన్, గాడి పల్లి భాస్కం పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

నీట్ పరీక్ష ఫలితాలను రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌తో తలపెట్టిన విద్యాలయాల బంద్ ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో మండలంలో విజయవంతమైంది. మండల ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం విద్యాలయాలను సందర్శించి బంద్ నిర్వహించారు.

నవ తెలంగాణ - సిద్దిపేట

నీట్ పేపర్ లీకేజి, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ పట్టణంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ .శ్రీకాంత్, ఏబీపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అజ్మత్, ఏఐవైఎఫ్, పీవైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు శంకర్, అనిల్ మాట్లాడుతూ కేంద్రంలో నీట్ పరీక్ష పత్రాలు లీకేజి చేసి ఇరవై నాలుగు లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం ఆడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త ఆందోళనలు జరుగుతున్నప్పటికీ దేశ ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు బహిరంగ క్షమపణ చెప్పాలన్నారు. నీట్ నిర్వహణంలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి, పేపర్ లీకేజీ కి పాల్పడిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి ,నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏబీపీఎస్‌యూ జిల్లా నాయకులు సంగెం మధు, రామగల్ల నరేష్, ప్రసన్న కుమార్, కొండం సంజీవ్, నగేష్, కృష్ణ, అభి, నవదీప్, సమ్మయ్య, యాదగిరి, సాగర్, అనిరుధ్, శ్రవణ్, శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై చేపట్టిన పాఠశాలల బంద్ ప్రశాంతంగా కొనసాగింది. విద్యార్థి సంఘాల నాయకులు ముందస్తుగా పాఠశాలల బంద్‌కు సహకరించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. దీంతో నంగునూరు మండలంలో ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

నవతెలంగాణ- రాయపోల్

నీట్ పరీక్ష అవకతవకలపై విచారణ చేపట్టి నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ దౌల్తాబాద్ మండలంలో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు ఆనంద్ ఆధ్వర్యంలో గురువార విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, నీట్ అవకతవకలపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు అమాన్ ,కుమార్ ,వినయ్, రాజు ,ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పదేండ్ల సేవ గొప్ప భాగ్యం



నవతెలంగాణ -నంగునూరు

ప్రజలు గుర్తించి రెండుసార్లు ప్రజా ప్రతినిధిగా అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అక్కెనపల్లి,సిద్దన్నపేట గ్రామాల ఎంపీటీసీ సభ్యుడు బెదురు తిరుపతి అన్నారు. ఐదేండ్ల పదవి కాలం పూర్తయిన సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గంలోని మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించిన సందర్భంగా ఎంపీటీసీ బెదురు తిరుపతి మాట్లాడుతూ గ్రామస్తులు మా కుటుంబంలోనే ఒక సారి సర్పంచ్, మరొక సారి ఎంపీటీసీగా అవకాశం కల్పించడంతో గ్రామ ప్రజలకు పదేండ్లు సేవ చేసే భాగ్యం తనకు మాత్రమే దక్కిందన్నారు.పదేండ్ల పదవి కాలంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైన స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు అండదండలతో ఎంపీటీసీ పరిధిలోని సిద్దన్నపేట తో పాటు అక్కెనపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంచామన్నారు. పదేండ్ల పదవి అవకాశం తనకు మాత్రమే దక్కిందన్నారు. తన రాజకీయ గురువు అయినా హరీశ్ అన్నతో పాటు ఇరు గ్రామల ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు బెదురు తిరుపతి ని ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ తడిసిన ఉమా, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, సంగు పురేందర్, నంగునూరు సొసైటి చైర్మన్ కోల రమేశ్ గౌడ్ నాయకులు బద్దిపడగ కిష్టారెడ్డి ,దువ్వల మల్లయ్య తదితరులు అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి నిధుల పట్ల మోసం చేసిన వ్యక్తి ఎంపీపీ గజ్జల సాయిలు

- వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఎంపీటీసీలు ఆవేదన



నవ తెలంగాణ మిరుదొడ్డి

ఐదేండ్ల పదవీకాలంలో ఎంపీపీ గజ్జల సాయిలు తమను ప్రతిసారి మోసం చేస్తూ కాలం గడపాడని వైస్ ఎంపీపీ పోలీసులు తో పాటు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు దూరంగా ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే ఎంపీటీసీ సభ్యులను మోసం చేయడంతో ఆందోళన వ్యక్తం చేస్తే ప్రతి గ్రామానికి నిధులు ఇస్తానని, ప్రొసిడింగ్లను అందజేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తనకు నచ్చిన ఎంపీటీసీలకు స్టేట్ మ్యాచింగ్ గ్రాండ్ నిధులను కేటాయించి, మిగతా వారిని అవమానపరచడన్నారు. పదవిలో ఉన్నప్పుడు ఎంపీపీ గజ్జల సాయిలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయకపోవడం సరికాదని మండిపడ్డారు. స్వార్థ రాజకీయం కోసం తమకు నచ్చిన ఎంపీటీసీకి నిధులు ఇచ్చి కాలయాపరి చేశాడని ఆరోపణ వ్యక్తం చేశారు. అభివృద్ధి ఎంపీపీ సాయిలు పై వ్యతిరేకతతో సన్మాన కార్యక్రమానికి దూరంగా ఉన్నామన్నారు. ప్రజలకు తాము చేసిన సేవలను గుర్తు చేయడంతో పాటు ఎంపీపీ చేసిన మోసాన్ని తెలియజేశామన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ గణేష్ ఆధ్వర్యంలో ఎంపీటీసీలు సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, జడ్పీటీసీ లక్ష్మీ లింగం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాల మల్లేశం, ఎంపీటీసీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

కస్తూర్బాకు బోరు మోటార్

నవతెలంగాణ- జగదేవ్‌పూర్ 9



జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి యల్‌టీఆర్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాని లక్కీరెడ్డి తిరుపతి రెడ్డి సహకారంతో గురువారం బోరు మోటర్ అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సేవ చేయడంలో ఆనందం ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరాలని అన్నారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కస్తూర్బా విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరుకున్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ కస్తూరిబా బాలికల విద్యాలయంలో గత వారం రోజుల క్రితం నుంచి బోరు మోటర్ పాడైపోయి ఉండగా పిల్లలకు నీటి సమస్య ఉందని యల్‌టీఆర్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాని లక్కీరెడ్డి తిరుపతి రెడ్డిని సంప్రదించాను అన్నారు. ఆయన వెంటనే స్పందించి వాటర్ ట్యాంకర్లను పాఠశాలకు పంపించారని బోరు మోటర్ పాఠశాలకు ఉచితంగా అందజేశారని అన్నారు. వారికీ పాఠశాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ధర్మా రావు, సీఆర్‌టీసీ లు విజయలక్ష్మి, డీ .చంద్రకళ, వీ.పుష్ప, డి.సుష్మత, బీ.మాధురి, కే.జ్యోతి, పీ. మల్లేశ్వరి, వీ. ప్రవంతి, యస్. శ్రీలత, యస్. అనిత, కే. నీరజ, యల్. సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పథకాలు కొనసాగించాలి

నవతెలంగాణ- జగదేవ్‌పూర్

గత ప్రభుత్వంలో రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం చేపట్టిన పలు రైతు సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించాలని పీఏసీఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం జగదేవ్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన రైతు భరోసా, రైతు పథకాలపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడే పథకాలను అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా పథకాలు చేపట్టి అమలు చేయాలని కోరారు. రైతు భరోసా, రైతు పథకాల పట్ల రైతుల అభిప్రాయాలను సేకరించి ఉన్నత స్థాయి అధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ నాగభూషణం, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకట్నర్సు, యాదయ్య, శ్రీనివాస్, రైతులు, కార్యాలయ సీఈఓ రాములు, సిబ్బంది, సత్యనారాయణ రెడ్డి సందీప్ రెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

వన మహోత్సవంను విజయవంతం చేయాలి

నవతెలంగాణ -నంగునూరు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నంగునూరు మండలంలో చేపడుతున్నట్లు నంగునూరు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి దేవికి దేవి అన్నారు. గురువారం ప్రత్యేక భాద్యతలను తీసుకున్న అనంతరం దేవి మీడియాతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు మండలంలోని అన్నీ గ్రామాలలో అనువైన చోట ఖచ్చితంగా కనీసం 50 మొక్కలు నాటాలన్నారు.మండల కేంద్రమైన నంగునూరులో 200 మొక్కలు నాటాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు, డ్వాక్రా గ్రూపు మహిళలు అందరు పాల్గొనేలా చూడాలని చెప్పారు.

ఎంపీటీసీని సన్మానించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-తొగుట 7



ఎంపీటీసీగా ప్రజా సేవ చేయడం గొప్ప విషయం అని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం వెంకట్రావు పేట, చందపూర్ ఎంపీటీసీ గా కంకణాల నర్సింలు ఐదు సంవత్సరాలు ఎన్నో సేవా కార్య క్రమాలు చేశారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. నేటితో పదవీకాలం ఐదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చందాపూర్ బీజేపీ యువ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి శ్రీకాంత్ యాదవ్, బెజుగామ ఆంజనేయులు, బెజుగామ రాజు, బొడ్డు పోచయ్య యాదవ్ ఉన్నారు.

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు

నవ తెలంగాణ -దుబ్బాక



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం దుబ్బాక పురపాలక కేంద్రంలోని రేపల్లె వాడలో కురుమ సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.గొర్రెల కాపరుల సంఘం దుబ్బాక మండలాధ్యక్షుడు గొల్ల రాజేశ్వర్, కురుమ సంఘం మండలాధ్యక్షుడు చిర్ర తిరుపతి, నాయకులు బట్టు ఎల్లం, సిద్దనబోయిన శ్రీనివాస్ యాదవ్, రుద్రారం లింగం, దండబోయిన రాజు యాదవ్, కంపె ప్రశాంత్, కిరణ్ పలువురు నివాళులర్పించారు.

బంద్ విజయవంతం



నవతెలంగాణ-చేర్యాల

కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని,నీట్ అవకతవకలపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాలు దేశ వ్యాప్తంగా గురువారం చేపట్టిన బంద్ చేర్యాల పట్టణం తోపాటు మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ విజయ వంతం అయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, పరీక్ష ను తిరిగి నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజ్ కు కారుకులైనటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆముదాల రంజిత్ రెడ్డి, రాహుల్, రాకేష్ రెడ్డి, మహేష్, శివ, రాకేష్, సాయి, తేజ, వంశీ, అరుణ్, ప్రశాంత్, అభిలాష్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రజా ప్రతినిధులకు సన్మానం

నవతెలంగాణ-దుబ్బాక



నేటితో పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా మండల పరిషత్ ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆస్క రవి, పలువురు ఎంపీటీసీలకు గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఐదేండ్లుగా మండలానికి మండల ప్రజా పరిషత్ ప్రజా ప్రతినిధులు అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో సూపరిండెంట్ శ్యామల ,ఎంపీఓ నరేందర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పలువురున్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ విరమణ సమావేశం

- దుబ్బాక కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి



ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో గురువారం మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎంపీటీసీలు దూరంగా ఉన్నారు. స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఎంపీటీసీలకు ఇవ్వకుండా ఎంపీపీ గజ్జల సాయిలు కాలయాపన చేస్తుండటాన్ని నిరసించారు. చాలాసేపు ఎంపీపీ గజ్జల సాయిలు తో ఎంపీటీసీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఎంపీపీ గజ్జల సాయిలు అస్పష్ట సమాధానమిస్తూ సన్మాన కార్యక్రమానికి వెళ్లిపోయారు. భూంపల్లి ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, రుద్రారం ఎంపీటీసీ కాముని మంజుల హాజరయ్యారు. ఆత్మీయ సన్మాన సమ్మేళనానికి దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం దుబ్బాక కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమావేశం హాజరై ఎంపీటీసీలకు సన్మానం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీలు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల పత్రాలు ఇవ్వకుండా ఎంపీపీ మోసం చేశాడని బీఆర్ఎస్ ఎంపీటీసీలు మిరుదొడ్డి మండల స్పెషల్ అధికారి గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఒంటెద్దు పోకడలు పోతున్న ఎంపీపీ వైఖరిని నిరసిస్తూ తమకు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ అధికారిని బీఆర్ఎస్ ఎంపీటీసీలు కోరారు.

బాసర త్రిబుల్ ఐటి కి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని ప్రభుత్వ నూతనోన్నత పాఠశాల విద్యార్థిని కే.అంజలి బాసర త్రిబుల్ ఐటీ సీటుకు ఎంపిక కావడం ఎంతో సంతోషమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. విజయ్ కుమార్ అన్నారు. గురువారం విజయ్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థిని ఉన్నత చదువులు చదివి, సమాజానికి సేవ చేయాలని, పాఠశాలకి మంచి పేరు తేవాలని, తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టాలని అన్నారు. విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గీతాదేవి, జి .తిరుపతిరెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్, దుర్గయ్య, శ్రీదేవి, రాజకుమార్ , రాజమోహన్ గౌడ్, లతీఫ్, జోత్స్న, రాజు పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట్ మున్సిపల్ 43 వార్డులో ప్రభుత్వ బాలికల పాఠశాల ఆరుగురు విద్యార్థులు బాసర త్రిబుల్ ఐటీ కి ఎంపికయ్యారని వార్డు కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం యాదవ్ తెలిపారు. గురువారం పూర్ణిమ మాట్లాడుతూ ఎంపిక అయిన ఆరుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే హరీష్ రావు, హెడ్మాస్టర్ మనోహర్, ఉపాధ్యాయులుత్రిబుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

ప్రాజెక్టు భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

- చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్



శ్రీరాం సాగర్ వరద కాలువ గౌరవెల్లి, గండిపెల్లి, తోటపెల్లి, రిజర్వాయర్ ముంపు బాధితలకు న్యాయం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం పెంచినందువల్ల 80 శాతం పనులు పూర్తై గూడాటిపల్లి,తేనుగుపల్లే,మద్దేలపల్లే, అనేక గిరిజన తండాలు ముంపుకు గురైనట్లు తెలిపారు. పునరావాస ప్యాకేజీ కింద నిర్వాసితులకు రైతులకు చెల్లించాల్సిన డబ్బులు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు .గత ఏడాది రిజర్వాయర్ లొ నీళ్ళు నిల్వ చేస్తామని ఆశించిన అమలు కాలేదని నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పూర్తి స్థాయిలో రానందున దిక్కు తోచని స్థితిలో ఉంటు దినదిన గండంగా బతుకులు వెల్లాదిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. 90 శాతం పూర్తి కాబడి మిగతా తుదిదశ పనులు పెండింగ్ లో ఉన్నాయని గత ముఖ్యమంత్రి కేసీఆర్ వరద కాలువ పనులను ప్రాదాన్యత ఇచ్చి వేగవంతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని అన్నారు.వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి శ్రీరాం సాగర్ వరద కాలువ గౌరవెల్లి, గండిపెల్లి, తోటపెల్లి రిజర్వాయర్ ముంపు బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు.


ప్రజల హృదయాలను గెలుచుకున్న నాయకులు

నవతెలంగాణ-తొగుట



ప్రజా జీవితంలో ఎంపీపీ, ఎంపీటీసీలుగా అలుపెర గని సేవలు చేసి ప్రజల హృదయాలను గెలుచుకున్నారని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువా రం తొగుట ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, పెద్ద మసాన్ పల్లి ఎంపీటీసీ సుమలత కనకయ్య, వెంకట్రావుపేట ఎంపీటీసీ కంకణాల నర్సింలు, వేములఘట్ ఎంపీటీసీ గణపురం కల్పన మల్లేశం, ఎటిగడ్డ కిష్టాపూర్ ఎంపీటీసీ కనకలక్ష్మీ లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు కలిముద్దీన్‌లను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేండ్ల పాటు ప్రజా జీవితంలో ఎంపీపీ, ఎంపీటీసీలుగా మెరుగైన సేవలు చేశారని కొనియాడారు. ప్రజల హృదయాలను గెలుచుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో- ఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), సీనియర్ నాయకులు మామిడి మోహన్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య, మైపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు బుర్ర నర్సింలు, తోయేటి ఎల్లం పాత్కుల వెంకటేశం, జిల్లా నాయకులు యెన్నం భూపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సిద్ధి శ్రీనకర్ రెడ్డి, రాంరెడ్డి, ఉప్పలయ్య, కొంగారి నర్సింలు, ఎల్లారెడ్డి ఆన్సర్, రాములు, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొ న్నారు.


రామవరం, నందారం ప్రజలకు కృతజ్ఞతలు



నవతెలంగాణ-అక్కన్నపేట: తనను నమ్మి ఎంపీటీసీగా గెలిపించి ఆదరించిన ప్రజలందరికీ తాజా మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీటీసీ పదవి చేపట్టి ఐదేండ్లు పూర్తయిందని గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఐదేండ్లలో ఎవరికైనా ఇబ్బందులు పెట్టి ఉంటే క్షమించాలని కోరారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవకై అంకితమై ఉంటానని తెలిపారు. నన్ను నమ్మి బీఆర్ఎస్ నుంచి బీఫాం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మళ్లీ చాన్స్ వస్తే ప్రజా నాయకుడిగా పోటీలో మీ ముందు ఉంటానని, ప్రజాసేవకు అంకితమవుతానని తెలియజేశారు.

పూడ్చి పెట్టిన కుక్కలకు పోస్టుమార్టం

నవతెలంగాణ-దుబ్బాక



వీధి కుక్కలను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత వీధి జంతువుల సంరక్షణ సంస్థ ప్రతినిధి ఎదులాపురం గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు గురువారం విచారణకు ఉపక్రమిం చారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 10 వార్డులో ఓ కుంటలో పూడ్చి పెట్టిన వీధి కుక్కలను పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో వెలికి తీశారు.మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు సమక్షంలో దుబ్బాక ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ బాలసుందరం,తిమ్మాపూర్ పశువైద్యాధికారి శ్రీనివాస్‌లు పోస్ట్ మార్టం నిర్వహించారు. పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోబడతాయని ఎస్ఐ గంగరాజు తెలిపారు.మున్సిపల్,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొమురయ్య సేవలు మరువలేనివి

- సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో





నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య సేవలు మారువలేనివని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో అన్నారు. కొమురయ్య 78వ వర్ధంతిని సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట మావో మాట్లాడుతూ నాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై భూస్వాముల జమీందారుల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన మహోత్తర పోరాటంలో కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య విసునూరు రామచంద్రారెడ్డి, నైజాం రజాకార్ మూకల తుపాకి దాడికి బలై కన్నుమూశాడని అన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాటం బలపడి దున్నేవానికి భూమి సాధించగలిగారని, వెట్టి చాకిరి విముక్తి జరిగిందని, గ్రామ స్వరాజ్యాలు ఏర్పడి తెలంగాణ ప్రాంత ప్రజలకు విముక్తి లభించిందన్నారు.పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్పొరేటు విధానాల వల్ల ప్రజలకు చెందాల్సిన భూములు ప్రైవేటుపరమై కార్పొరేటు బడా భూస్వాముల చేతిలో ఉండిపోతున్నాయని అన్నారు. నాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తితో నేడు దేశవ్యాప్తంగా కార్పొరేట్ విధానంనాలపై పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, రాబోయే రోజుల్లో సీపీఐ(ఎం) నిర్వహించే పోరాటాలకు పేదలు కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు ఆముదాల నర్సిరెడ్డి, బోయిని మల్లేశం,ముస్త్యాల ప్రభాకర్, ఇప్పకాయల శోభ, ఎర్రబోసు అశోక్, బొంగోని భాస్కర్, యాడారం బ్రహ్మయ్య, బుట్టి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొమురవెల్లి

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతిని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సత్తిరెడ్డి మాట్లాడుతూ నాడు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో కులమతాలకతీతంగా, ప్రజలంతా ఏకమై భూస్వాముల జమీందారుల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన మహోత్తర పోరాటంలో కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమరయ్య విసునూరి రామచంద్రారెడ్డి, నైజాం రజాకార్ మూకల తుపాకి దాడికి బలై కన్నుమూశారన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాటం బలపడి దున్నేవానికి భూమి సాధించగలిగారన్నారు. వెట్టి చాకిరి విముక్తి జరిగిందని గ్రామ స్వరాజ్యాలు ఏర్పడి తెలంగాణ ప్రాంత ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ఈ మహత్తర పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో నేటి పాలకులు పేద ప్రజల అభ్యున్నతి కృషి చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో సిపిఎం నిర్వహించే పోరాటాలకు పేదలు కార్మికులు కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరీ రవీందర్, అత్తిని శారద, మండల నాయకులు వుల్లంపల్లి సాయిలు,సార్ల యాదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల, సర్పంచుల సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాలలో పడే బాధ నాకు తెలుసని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఇంచార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేండ్లుగా గ్రామాల అభివృద్ధిలో ఎంపీటిసీలు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. సర్పంచులది, ఎంపీటీసీలది గ్రామాలలో కష్టం చాలా పెద్దదని, గ్రామాల్లో పాలన విషయంలో చిన్న పని నుంచి మొదలుకుంటే పెద్ద పని వరకు సర్పంచులు, ఎంపీటీసీలే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. సేవ చేయడమే లక్ష్యంగా గ్రామాల్లో ప్రతినిత్యం తాపత్రయ పడుతూ ఉంటారని పేర్కొన్నారు. కేసీఆర్ ఆనాడు సర్పంచ్‌ల ,ఎంపీటీసీల బాధలు అర్థం చేసుకొని గౌరవ వేతనాన్ని పెంచారని గుర్తు చేశారు. కేసీఆర్ పదేండ్ల పరిపాలనలో పనిచేసిన ఎంపీటీసీలు, సర్పంచులు సేవలు ఎల్లకాలం గుర్తుండిపోతాయని తెలిపారు.పదవులకే విరమణ తప్ప రాజకీయానికి కాదని అన్నారు.చేర్యాల ప్రాంతం అంటే నాకు చాలా ఇష్టం. చేర్యాల ప్రాంతం పోరాటాలకు పురిటిగడ్డ అని, తనను అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించిన చేర్యాల ప్రాంతం అంటే తనకు చాలా ఇష్టమని ఎమ్మెల్యే పల్లా అన్నారు. ప్రాంతం గురించి సేవకులుగా పనిచేస్తూ ప్రాంత అభివృద్ధికి తోడ్పడుతానని, పెండింగ్ పనులనుపూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. తన నీలిమ హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నమని తెలిపారు. ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ విజ్ఞానవంతుడని, పరిపాలనలో యువ నాయకుడు, సౌమ్యుడని, దైవ భక్తి కలవాడని ఎమ్మెల్యే పల్లా హితవు పలికారు. చిన్న వయసులోనే ఎంపీపీగా ఎదిగి అందరి మన్ననలు పొందాడని, దైవభక్తి అతనికి ఎక్కువ అని ఆ దేవుని ఆశీస్సులతో మరెన్నో పదవులు అధిరోహించాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, ఎంపీటీసీలు గూడూరు బాలరాజు, ఎలికట్టె శివ శంకర్ గౌడ్, సుంకరి శ్రీధర్ గౌడ్, తౌట సుధారాణి, గదరాజు యాదగిరి, ముచ్చంతల వినోద, మిట్టపల్లి సులోచన, ఏనుగుల లక్ష్మీ నర్సమ్మ బీఆర్ఎస్ వీ.రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు, గదరాజు చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పదవి విరమణ ఉండదు



నవతెలంగాణ-రాయపోల్ : ప్రజలకు సేవ చేయడానికి పదవీ విరమణ ఉండదని రాజకీయ నాయకులు ప్రజా సమస్యలు తీర్చుకుంటూ ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉండాలని ప్రజా సేవ చేసే అదృష్టం అందరికీ రాదని రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, ఎంపీడీవో బాలయ్య అన్నారు. గురువారం రాయపోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలకు ఆత్మీయ వీడుకోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీకాలం ముగిసిన రాజకీయ నాయకులు ప్రజల మధ్యలోనే ఉండాలని సూచించారు. తద్వారా మళ్లీ పదవులు వరించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాయపోల్ ప్రజలు తమను ఆదరించారని, రాయపోల్ మండలం అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయడం జరిగిందన్నారు. ప్రజాసేవ చాలా గొప్పదని అలాంటి అవకాశం అందరికీ రాదని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే చిరకాలం ప్రజల్లో గుర్తుండిపోతామన్నారు. సమావేశం అనంతరం పదవి విరమణ పొందుతున్న వారికి శాలువ, మేమేంటోతో సత్కరించి అభినందించారు. అలాగే గతంలో రాయపోలు మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు మేరీ స్వర్ణకుమారి, చిన్న మున్నయ్యలను ఘనంగా సత్కరించి వీడుకోలు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ఎంపీఓలు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ముత్తాలిఫ్, ఐకేపీ ఏపీఎం ప్రసాద్, ఎంపీటీసీలు ఎల్కల్ వెంకటయ్య, వడ్డేపల్లి ప్రభాకర్, రాంసాగర్ లక్ష్మి కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు భరోసా పై అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-తొగుట



రైతు భరోసా పథకం పై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సొసై టీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో సొసైటీ చైర్మన్ రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధును ఈ ప్రభుత్వం రైతు భరోసాగా పేరు మార్చి రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించడానికి రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా గురువారం తొగుట మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నా రు. గత ప్రభుత్వం రైతులకు రైతుబంధు అందించడం వల్ల చిన్న, సన్న కారు రైతులకు సరైన న్యాయం చేకూరిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు బంధు నిధులు రావడం లేదని ప్రతిపక్ష నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని తెలిపారు. కానీ రాష్ట్రంలో దాదాపుగా 75 నుంచి 80 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని గుర్తు చేశారు. రైతులందరు సమిష్టిగా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ సాగు చేసే పది ఎకరాలకు రైతు భరోసా అందజేయాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన సర్వే పూర్తి చేయించి రైతులకు రైతు భరోసా నిధులను వెంటనే అందజేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, అడిట్ ఆఫీసర్ నాగేశ్వర్ రావు, మండల వ్యవసాయ అధికారి మోహన్, సీఈఓ గంగారెడ్డి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

- డీఎం అండ్ హెచ్ఓ



నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా డీఎం అండ్ హెచ్ఓ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి దగ్గరికి వెళ్లి వారి ఆరోగ్య క్షేమ సమాచారాలు తెలుసుకొని తగు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందితో సీజన్‌లో వచ్చే ఆరోగ్య సమస్యల పైన నివారణ చర్యల పైన, మెడికల్ క్యాంపుల నిర్వహణ పైన, జాతీయ, రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన, రాపిడ్ రెస్పాన్స్ టీమ్ల పనితీరు పైన సమీక్ష నిర్వహించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ, వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పైన క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, రాపిడ్ రెస్పాన్స్ టీంల ద్వారా గ్రామాల్లో సందర్శించి జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి చికిత్స అందించాలని, ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త నమూనాలు సేకరించి టీ హబ్ త్వరతగతిన పంపించాలని , ఐపీఓపీ సంఖ్య పెంచాలని, సమయపాలన పాటించాలని అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరం ఉన్న చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ శ్రీనివాస్ వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంగన్వాడిలో గ్రోత్ మేళా

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో గురువారం అంగన్వాడి టీచర్ లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రోత్ మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎదిగే వయసులో పిల్లలకు తప్పకుండా ప్రోటీన్స్ ఉన్న ఫుడ్ అందించాలన్నారు. ప్రతిరోజు అంగన్వాడిలో ఇచ్చే గుడ్లను వాళ్లకు తినిపించాలని తెలిపారు. అంతేకాకుండా బాలామృతం ద్వారా వారికి ఎంతో శక్తి వస్తుందని, ఈ బాలమృతాన్ని వారికి ఇడ్లీలుగా తయారు చేసి పెడితే చాలా ఇష్టంగా తింటారని తెలిపారు. అంతేకాకుండా తప్పనిసరిగా గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని తినాలని, దీనివల్ల బిడ్డ గ్రోత్ పెరుగుతుందని తెలియజేశారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రాజేశ్వరి, ఆశాలు, ఆయాలు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీలో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసిన పదిమంది విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీటు సంపాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్, ఉపాధ్యాయులు విలేకరులతో మాట్లాడుతూ పది మంది విద్యార్థులకు త్రిబుల్ ఐటీలో సీటు సంపాధించడం అభినందనీయమన్నారు. బోనగిరి మేఘన, ఏల్పుల అంజనాదేవి, ఇట్టవేని స్వేత, చిట్యాల నిక్షిమిత, ఎగ్గోజు సాయిదీప్తి, ఏల్పుల సంజనాదేవి, గడ్డం పూజిత, జెట్టి నిహారిక, గంగాధర రిశ్వంత్, కొడముంజ అశ్రితలు ఎంపికైనట్లు తెలిపారు. పదోతరగతి ఫలితాలలో మంచి ప్రతిభను కనబరిచి బాసరాలో సీటు సంపాధించడం పట్ల ఉపాధ్యాయులు కందాల రవీందర్, రాజమౌళి, గ్రామస్థులు, తదితరులు విద్యార్థులను అభినందించారు.

ప్రజాప్రతినిధులు ఎప్పుడు ప్రజా సేవకులే

- ఎంపీపీ అనసూయ,



నవతెలంగాణ-కొండపాక

ప్రజా ప్రతినిధులు ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజాసేవకుల్లా సేవ చేయాల్సిందేనని వారికి వీడ్కోలు ఉండదని కొండపాక ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అన్నారు. గురువారం కొండపాక సమీకృత మండల కార్యాలయంలో ప్రస్తుత ఎంపీటీసీల పదవీకాలం ముగిసినందున వారికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన నాయకులు ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు చేదోడు వాదోడుగా అండగా నిలుస్తామన్నారు. వారికి పదవి విరమణ వీడ్కోలు ఉండదని, కేవలం అధికారులకు మాత్రమే వీడ్కోలు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.ఐదేండ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు పదవి కాలంలోని అనుభవాలను సమావేశంలో తెలిపారు. అనంతరం మండలంలోని ఎంపీటీసీలను, మండల, గ్రామస్థాయి అధికారులను శాలువా మొమెంటులతో ఎంపీపీ వైస్ ఎంపీపీలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ నాగేందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబాగౌడ్, విశ్వనాథ్ పల్లి రవీంద్రనగర్ సర్పంచ్ లింగారావు,ఎంపీటీసీలు బాలాజీ, భూములు గౌడ్, ఆంజనేయులు, ఆరుట్ల లక్ష్మి కనకయ్య పిల్లి శిరీష నాగరాజు, నందాల శ్రీనివాస్, హరిత సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం పంపిణీ

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణంలోని రెండో వార్డులోని పోచమ్మవాడ 1వ అంగన్ వాడి సెంటర్‌లో గురువారం సీ డీపీఓ జయమ్మ బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్ వాడి టీచర్లు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్, హెల్త్ ఆఫీసర్ తులసి అంగన్వాడి టీచర్ జాల సరిత, స్వరూప, తిరుమల, భాగ్యలక్ష్మి, వార్డ్ ఆర్పి శ్రీలత పాల్గొన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ఆహ్వానం

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాకలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్ లలో రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెల 15వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ డీ.వెంకటరమణ గురువారం తెలిపారు.ఖాళీగా ఉన్న ఎలక్ట్రీషియన్- 15, ఫిట్టర్ -20 ట్రేడ్ లలో ఆసక్తిగల విద్యార్థులు వెబ్ ఆప్షన్లను మార్చుకోవాలని సూచించారు. దుబ్బాక లోని పాత తహసీల్దార్ కార్యాలయం లోకి ప్రభుత్వ ఐటీఐ కళాశాలను నిర్వహించుకునేందుకు జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అనుమతినిచ్చినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతినెల పిల్లల ఎత్తు, బరువును చెక్ చేసుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప

నవతెలంగాణ-చేర్యాల



అంగన్వాడీ కేంద్రంలో ప్రతినెల పిల్లల ఎత్తు, బరువులను చూయించుకోవాలని చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.చేర్యాల పట్టణ కేంద్రంలోని 1వ,3వ,6వ,11వ అంగన్వాడీ కేంద్రాలతో కురుమ వాడలో గల అంగన్వాడీ కేంద్రంలో గురువారం వివిధ శాఖలు, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి ఆధ్వర్యంలో గ్రోత్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్స్, మహిళా సంఘాలు, ఏఎన్ఎంల సమక్షంలో 0 నుంచి ఐదేండ్ల పిల్లల ఎత్తు, బరువు కొలతలు తీశారు. ఈ సందర్భంగా వయస్సుకు తగ్గ బరువు, ఎత్తుకు దగ్గర బరువు ఉండేలా పిల్లలను ఎస్ఏఎం,ఎంఏ ఎం,ఎస్‌యూడబ్ల్యూలో లేకుండా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ అనుబంధ పౌష్టికాహారం తగినంత పిల్లలకు తినిపిస్తే బరువులో సరియైన పోషణ, ఎదుగు దల, గర్భిణీ మొదలుకొని ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో తగినంత పౌష్టికాహారం,ఉచిత విద్య అందిస్తారని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు,ఆశాలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-రాయపోల్



త్రిపుల్ ఐటీ బాసర రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వ విద్యాలయముకు రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పీ. నిఖిత, పీ.మైత్రి, రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పీ. అఖిల, డీ.అక్షయ ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీ. నిఖిత, పీ.మైత్రి ఇద్దరు రాంసాగర్ పాఠశాలకు చెందిన పీ.అఖిల, డీ. అక్షయ ఇద్దరు విద్యార్థులకు ఐఐటి బాసరలో సీటు రావడం మాకు ఎంతో గర్వ కారణమన్నారు. మా పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థులు ఐఐటికి ఎన్నికకావడం మా ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఫలితంగానే సాధ్యం అయిందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యను బోధిస్తూ, ఇలాంటి మట్టిలో మాణిక్యాలను వెలికితీసే ఘనత ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాధ్యం అవుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు రావడమే దీనికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన సన్న బియ్యంతో భోజనం పెడుతూ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు చేత విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన పీ. నిఖిత, పీ.మైత్రి, పీ.అఖిల, డీ.అక్షయ విద్యార్థులు ఐఐటీ సీటు సంపాదించి, మా పాఠశాలలకు, గ్రామాలకు, తల్లిదండ్రులకు ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చినందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు.